# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 28-2-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 183 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## ఎన్నికల కేసులో నాంపల్లి కోర్టుకు కవిత

### భారీగా తరలివచ్చిన టీఆర్ఎస్ కార్యకర్తలు

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ):నిజామాబాద్ ఉపఎన్నికల కేసులో తదుపరి విచారణను నాంపల్లి కోర్టు మార్చి 19కి వాయిదా వేసింది. ఈ కేసులో ఏ1గా ఉన్న మాజీ ఎంపీ కవిత కోర్టుకు హాజరయ్యారు. ఏ3గా ఉన్న ఝాన్సీ రాణి చనిపోయారని పోలీసులు కోర్టుకు తెలిపారు. ఏ2గా ఉన్న మోపినేని నిర్మల, ఏ4గా ఉన్న జుగల్ కిషోర్ కోర్టుకు హాజరు కాలేదు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను మార్చి 19కి న్యాయస్థానం వాయిదా వేసింది. ఇదిలా ఉంటే .. కవిత రాక సందర్భంగా నాంపల్లి కోర్టుకు టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కోర్టు హాలులోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో స్వల్ప తోపులాట జరిగింది. చివరకు వారిని పోలీసులు అదుపు చేశారు.

# ప్రతీ ఒక్కరూ పచ్చదనంపై దృష్టి సారించాలి



సూర్యాపేటలో ఆకస్మిక తనిఖీ చేపట్టి ప్రజలతో మాట్లాడిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

### భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం ఇవ్వాలి

### ఆకస్మిక తనిఖీలో ఇల్లిల్లూ తిరిగిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

సూర్యాపేట,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కెసిఆర్ మానసపుత్రిక పట్టణ ప్రగతి అని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా సుర్యాపేటలోని 33వ వార్డులో జగదీష్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. కాన్వాయ్‌ను పక్కన పెట్టి ఇంటింటికి వెళ్లి కాలనీ వాసులతో మంత్రి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లలో పచ్చదనంపై దృష్టి సారించాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. గ్రీనరీ పెంచడానికి స్థలం లేని వారు రూఫ్ గార్డెన్‌లపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీలో 10శాతం నిధులు పచ్చదనం పెంపునకు ఖర్చు చేయాలన్నారు. పట్టణాల్లో పారిశుద్యం, పచ్చదనం పెరగాలని..నాటిన మొక్కల్లో 85 శాతం బతకాలన్నారు. 75 గజాల లోపల ఇల్లుకట్టుకుంటే ఎలాంటి అనమతి అవసరం లేదని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో పట్టణప్రగతి కార్యక్రమంతో పట్టణాలను అద్భుతంగా తీర్చిదిద్దుకుందామని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన అత్యంత విలువైన ఆస్తి ఆక్సిజన్ మాత్రమేనని, అది అందించే కార్యక్రమం మన ఇంటి నుంచే ప్రారంభం కావాల్సి ఉందని గుర్తు చేశారు. నేడు యావత్ ప్రపంచాన్ని పర్యావరణం బెంబేలెత్తిస్తుందని, మానవాళి మనుగడనే ప్రశ్నార్ధకంగా మార్చుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల జబ్బులకు పర్యావరణ సమస్య ప్రధాన కారణమని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో ఆక్సిజన్ కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. అలాంటి పరిస్థితిని అధిగమించడం మన చేతుల్లోనే ఉందని, అందుకు మొక్కలు పెంచడవే పరిష్కారమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన మహోత్తర కార్యక్రమం హరితహారం అందులో భాగమేనని గుర్తు చేస్తూ అడవుల పెంపకంతోనే మానవాళిని కాపాడొచ్చన్నది కేసీఆర్ సంకల్పమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కోట్లాది నిధులు ఇస్తూ చేపడుతున్న పట్టణ ప్రగతి కార్యక్రమం మున్సిపాలిటీ వారు, ఇతర శాఖల అధికారులు వచ్చి వీధుల్లో చెత్తను ఎత్తడం, మురికి కాల్వలను తీయడం, మొక్కలు నాటి నీళ్లు పోయడానికి కాదని మంత్రి చెప్పారు. పట్టణ ప్రగతిలో పర్యావరణ సమస్యకు చెక్ పెట్టేలా ప్రజలకు అవగాహన కల్పించడమే అన్నారు. పట్టణ ప్రగతిలో మొదటి ప్రాధాన్యత పర్యావరణం, రెండోది పారిశుధ్యం, మూడవది శ్మశానవాటికల నిర్వహణ ఇలా అనేకం ఉన్నాయన్నారు. ఇళ్లు కట్టుకునే వారు విధిగా మొక్కలు నాటి పెంచాలన్నారు.



తెలంగాణ వాణిజ్య ప్రోత్సాహక సంస్థ డైరీని ఆవిష్కరించిన మంత్రులు మహ్మూద్ అలీ,శ్రీనివాసగౌడ్

# ఆబ్కారీశాఖపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం..

హైదరాబాద్, ఫిబ్రవరి 27: రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇవాళ ఆబ్కారి శాఖపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రోహిబిషన్ ఉ ఎక్సైజ్ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు కమిషనర్ అజయ్ రావు, హరికిషన్, జేసీ -ఎస్ వై ఖురేషి, ఈఎస్ దత్తరాజ్ గౌడ్ తో పాటు టీఎస్ బీసీఎల్ ఉన్నతాధికారులు సంతోష్ రెడ్డి, కులకర్ణి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నీరా పాలసీని ప్రవేశపెట్టామన్నారు. నీరా పాలసీలో భాగంగా ఆబ్కారి శాఖ అధికారులు కేరళ, రాజమండ్రిలోని హార్టికల్చర్ యూనివర్సిటీలలో నీరా తయారీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీరా సేకరణ, నిల్వ, మార్కెటింగ్ లతో పాటు నీరా కేఫ్ ల ద్వారా నీరాను అందించడంపై చేసిన పరిశోధనల పురోగతిపై మంత్రి ఆబ్కారి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల ఆరోగ్యంతో పాటు గీత వృత్తి దారుల ఆత్మగౌరవం కోసం ప్రవేశపెట్టిన నీరాను త్వరలో ప్రజలకు అందించేందుకు ఆబ్కారి శాఖ ఉన్నతాధికారులు అవసరమైన ప్రణాళికలు వేగంగా సిద్ధం చేయాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. టీఎస్ బీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్లు డిపోల సామర్థ్యాన్ని బట్టి అవసరమైన కొత్త డిపోల ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందించాలని మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆబ్కారి శాఖ అధికారులను ఆదేశించారు.

## చరిత్రలో నేటినిజం

కం॥ రచయితగ సమాజమునే
ప్రచలితమొనరించగలుగు ప్రజ్ఞానిధిగా
వచియింపంబడె -ప్రజచే-
మచిలాముచిత్రము తెరిగిన "ఉమరాలీషా"॥

(ఫిబ్రవరి 28 ఉమర్ ఆలీషా జననం..)



-రాధశ్రీ
సెల్: 9494481210

## సామాజిక మాధ్యమాలతో మోసపోవద్దు

### అప్రమత్తంగా లేకపోతే అసలుకే మోసం

### షీ టీమ్స్ సూచనలు పాటించాలన్న స్వాతి లక్రా

హైదరాబాద్,ఫిబ్వరి27(ఆర్ఎన్ఎ): వేధింపులు, ఈవ్‌టీజింగ్ బారిన పడుతున్న వారు తక్షణం షీ టీమ్‌కు ఫోన్ చేసి తెలపాలని పోలీసులు సూచించారు. ఎన్ని చర్యలు తీసుకున్నా నగరంలో పోకిరీల్లో మార్పు రావడంలేదని ఘటనలను బట్టి తెలుస్తోందన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ఎక్కువగా చనువుగా ఉండడం సరికాదన్నారు. అపరిచితులను నమ్మవద్దని మహిళలకు ముఖ్యంగా యువతులకు సూచించారు. మోసం జరిగితే తక్షణం స్పందించేలా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐజి స్వాతి లక్రా సూచిస్తున్నారు. ఆకతాయిలు, పోకిరీలు వేధిస్తున్నప్పుడు డయల్ 100కు ఫోన్‌చేస్తే పది నిమిషాల్లో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటారని అన్నారు. . ఈవ్‌టీజర్లను పట్టుకుని వెళ్తారు. గతంలో బాధితులు ఫోన్ చేయకుండా 'షి' బృందానికి ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, వృత్తివిద్య కళాశాలలు, బస్‌స్టాపులు, బస్సు లోపల, వాణిజ్య సముదాయాలు, ఉద్యానవనాలు, దేవాలయాల, మల్టీప్లెక్స్‌ల దగ్గర ఈవ్‌టీజింగ్ కొనసాగుతోంది. యువతులు, విద్యార్థినులు ద్విచక్ర వాహనాలు, కార్లలో వెళ్తుంటే వారి వెంటపడి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.

## ఢిల్లీలో దారికొస్తున్న పరిస్థితులు

### 34కు చేరిన మృతుల సంఖ్య

### పరిస్థితిని చక్కబెడుతున్న పోలీసులు

### పలుప్రాంతాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ఈశాన్య ఢిల్లీలో పరిస్థితులు అదుపులోకి వస్తున్నాయి. ఇప్పుడక్కడ ప్రశాంత వాతావరణం నెలకొనేలా చేసిన ప్రయత్నా లు ఫలించాయి. తాజాగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకున్నా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఒకరు మృతి చెందారు. దీంతో ఢిల్లీ మతఘర్షణల్లో మృతి చెందిన వారి సంఖ్య 34కు చేరుకున్నది. ఈశాన్య ఢిల్లీలో గత మూడు రోజుల క్రితం .. సీఏఏ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న ఘర్షణలు ఉద్రిక్తతలకు దారితీసాయి. వరుసగా మూడు రోజుల పాటు రెండు వర్గాలు కొట్టుకున్నాయి. ఆ సంఘటనల్లో మరణించిన వారి సంఖ్య 34కు చేరుకున్న ట్లు తెలుస్తోంది. మరో 200 మంది గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం అల్లర్లు ప్రారంభం కాగా,తీవ్ర ఆగ్రహావే శాలకు లోనైన రెండు వర్గాలు.. స్థానికంగా ఉన్న షాపులు, ఇండ్లు, వాహనాలకు నిప్పుపెట్టారు. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. జఫ్రాబాద్, మౌజ్‌పుర్, బాబర్‌పుర్, యమునా విహార్, చాంద్ భాగ్, శివ్ విహార్ ప్రాంతాల్లో హింస హెచ్చు స్థాయిలో జరిగింది. జీటీబీ హాస్పటల్‌లో గురువారం అయిదుగురు చనిపోయారు, దాంతో మృతుల సంఖ్య పెరిగినట్లు ఆరోగ్యశాఖ అధికారులు చెప్పారు. చాంద్‌భాగ్‌లో డ్రైనేజీలో బుధవారం ఐబీ ఆఫసర్ శవాన్ని వెలికితీశారు. ఇదిలావుంటే ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్ ఓపి శర్మ చాంద్‌బాగ్‌లో గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎలాంటి భయం లేకుండా దుకాణ సముదాయాలు తెరుచుకోండని అన్నారు. మీకు రక్షణగా మేమున్నామని తెలిపారు. ముఖ్యంగా మెడికల్ షాపులు, కిరాణం.. తదుపరి షాపులన్నీ తెరిచి ప్రజలకు సహకరించాలని ఆయన కోరారు. రోడ్లపై ఎవరూ గ్రూపులుగా ఉండకూడదనీ.. ముఖ్యంగా యువకులు బృందాలుగా ఏర్పడకూడదని ఈ సందర్భంగా తెలిపారు.

## కారు టైరు పేలి ప్రమాదం

### కాల్వలోకి దూసుకెళ్లి ముగ్గురు మృతి

### ప్రాణాలతో బయటపడ్డ కుమారుడు

నల్లగొండ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): కరీంనగర్, భువనగిరిలో కాల్వల్లోకి కారు దూసుకెళ్లిన ఘటనలు మరవకముందే అలాంటి ఘటనే మరొకటి చోటు చేసుకుంది. తాజాగా నల్లగొండ జిల్లాలోని ఏఎంఆర్‌పీ లింక్ కెనాల్‌లోకి మరో కారు దూసుకెళ్లింది. నల్లగొండ జిల్లాలోని పీఏపల్లి మండలం దుగ్యాల వద్ద విషాదం నెలకొంది. కారు కాల్వలోకి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో తల్లిదండ్రు లతో పాటు కూతురు ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు ప్రాణాలతో బయట పడ్డాడు. వేగంగా వెళుతున్న కారు ముందు టైరు పేలడంతో.. రోడ్డు పక్కనే ఉన్న ఏఎంఆర్‌పీ లింక్ కెనాల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న దంపతులు ఓర్సు రఘు, అలివేలు, కుమార్తె కీర్తి మృతి చెందారు. స్థానికులు, పోలీసులు కలిసి రఘు కుమారుడిని ప్రాణాలతో కాపాడారు. క్రేన్ సాయంతో కాల్వలోకి దూసుకెళ్లిన కారును బయటకు తీశారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు, సోదరి చనిపోవడంతో కుమారుడు కంటతడి పెట్టారు. మృతులను పీఏపల్లి మండలం వడ్డెరిగూడెం వాసులుగా పోలీసులు గుర్తించారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికే పట్టణ ప్రగతి

### వరంగల్ ప్రగతి కార్యక్రమంలో మంత్రి సత్యవతి

వరంగల్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించడానికే? సీఎం కేసీఆర్ పట్టణ ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన పట్టణ ప్రగతిలో మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండా ప్రకాష్ పాల్గొన్నారు. వార్డుల్లో తిరుగుతూ.. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భాగసౌమ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కరెంటు పోల్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

# ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఆకస్మిక బదిలీ

### రాత్రికిరాత్రే ఉత్తర్వులపై రాష్ట్రపతి సంతకం

### బదిలీని తప్పుపట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): పోలీసుల వైఫల్యం వల్లే ఢిల్లీలో అల్లర్లు చోటుచేసుకున్నాయని చెప్పిన ఢిల్లీహైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్ మురళీధర్‌పై వేటు పడింది. కేంద్రాన్ని,రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఢిల్లీ పోలీసులను ప్రశ్నించిన ఆ న్యాయమూర్తిని బదిలీ చేశారు. ఢిల్లీ హైకోర్టు నుంచి పంజాబ్, హర్యానా హైకోర్టుకు ఆయన్ను బదిలీ చేసారు. రెండు రోజులుగా ఈశాన్య ఢిల్లీలో జరుగుతున్న అల్లర్లకు సంబంధించిన పిటీషన్లపై అర్ధరాత్రి విచారణ జరిపి, సత్వర ఆదేశాలు జారీ చేసిన ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ మురళీధర్ బదిలీ అయ్యారు. ఆయనను పంజాబ్-హరియాణా హైకోర్టుకు బదిలీ చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి సంబంధించిన గెజిట్‌పై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. వాస్తవానికి మురళీధర్ బదిలీ గురించి కొంత కాలంగా చర్చ జరుగుతోంది. ఈనెల 12వ తేదిన సుప్రీంకోర్టు కొలిజీయం ఆయన బదిలీకి ప్రతిపాదించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టు బార్ అసోసియేషన్ అప్పటి నుండి ఆందోళన చేస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ దాడులకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై ఆయన బుధవారం అర్ధరాత్రి తన నివాసంలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల తీరును తప్పుబట్టారు. ఒక వర్గానికి చెందిన క్షతగాత్రులను సురక్షితంగా ఆసుపత్రికి తరలించడాన్ని అడ్డుకోవద్దని ఢిల్లీ పోలీసులను ఆదేశించారు. అవసరమైతే క్షతగాత్రుల తరలింపులో సహకరించాలని కూడా సూచించారు. ఢిల్లీ పోలీసులకు కొన్ని కీలక సూచలను సూచిస్తూ మూడు పేజీల తీర్పు పాఠాన్ని వినిపించారు. ఈ విచారణ చేపట్టి 24 గంటలు కూడా గడవక ముందే ఎస్ మురళీధర్ బదిలీ కావడం ప్రాధాన్యతను సంతరిచుకుంది. బుధవారం రాత్రి 11 గంటలకు ఆ జడ్జిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ న్యాయమూర్తిని బదిలీ చేయాలని రెండు వారాల క్రితమే సుప్రీంకోర్టు కొలిజియం ప్రతిపాదన చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 222 క్లాజ్(1) ప్రకారం ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. జస్టిస్ మురళీధర్‌ను ట్రాన్స్‌ఫర్ చేయాలని ఢిల్లీహైకోర్టు బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అయితే తాజా ఢిల్లీలో జరిగిన అల్లర్ల కేసును విచారించిన జస్టిస్ మురళీధర్.. పోలీసుల్ని తప్పుపట్టడంతో సీన్ రివర్స్ అయ్యింది. 1984 నాటి పరిస్థితులు పునరావృత్తం కావొద్దు అంటూ ఆ న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నడం వివాదాస్పదమైంది. విద్వేష ప్రసంగాలు చేసిన బీజేపీ నేతల వీడియోలను పరిశీలిస్తున్న సమయంలో జడ్జి ఆ తీర్పునిచ్చారు. మొత్తంగా ఈ బదిలీపై కాంగ్రెస్ మండిపడింది. అధికార దుర్వినియోగానికి జడ్జిని బలి చేశారని ఆరోపించింది.

# వూహాన్‌లో చిక్కుకుపోయిన 76 మంది ఢిల్లీకి చేరిక

### వీరిలో ఏడు దేశాలకు చెందిన మరో 36 మంది

### ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించిన అధికారులు

### అబ్జర్వేషన్‌లో 14రోజుల పాటు ఉంచనున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): చైనాలోని వూహాన్ లో చిక్కుకుపోయిన 76 మంది భారతీయులు ఢిల్లీకి చేరుకున్నారు. భారతీయులతో పాటు ఏడు దేశాలకు చెందిన మరో 36 మంది ప్రయాణికులను తీసుకుని ఎయిర్ ఫోర్స్ విమానం.. తెల్లవారుజామున ఢిల్లీ ఎయిర్ పోర్టులో దిగింది. ప్రయాణికుల తరలింపులో చైనా అధికారులు సహకరించారని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. అటు జపాన్ డైమండ్ ప్రిన్సెస్ నౌకలో చిక్కుకుపోయిన 119 మంది భారతీయులు కూడా ఢిల్లీకి చేరుకున్నారు. జపాన్ తీరంలో ఉన్న షిప్ నుంచి భారతీయులను ముందు టోక్యో తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తీసుకుని వచ్చారు. భారత ప్రయాణికులతో పాటు శ్రీలంక, నేపాల్, దక్షిణాఫ్రికా, పెరూ దేశాలకు చెందిన ఐదుగురు వ్యక్తులను ఢిల్లీకి తీసుకువచ్చింది ప్రత్యేక విమానం. చైనా , జపాన్ నుంచి వచ్చిన ప్రయాణికులకు మానేసర్ లో కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు అధికారులు. 14 రోజులపాటు అబ్జర్వేషన్‌లో ఉంచిన తర్వాత సొంత గ్రామాలకు పంపించనున్నారు. మరోవైపు చైనాలో కోవిడ్ తీవ్రత క్రమంగా తగ్గుతోంది. కేసుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. అయితే దక్షిణ కొరియాలో మాత్రం కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఒక్కరోజే కొత్తగా 334 కేసులు నమోదయ్యాయి. దీంతో కొరియాలో మొత్తం కోవిడ్ కేసుల సంఖ్య 15 వందల 95కు పెరిగింది. ఇక ఇరాన్‌లో 39 మంది చికిత్స తర్వాత కోవిడ్ వైరస్ నుంచి బయటపడ్డారు. చైనా నుంచి 36మంది విదేశీయులు సహా 112మందితో వచ్చిన గ్లోబ్ మాస్టర్ విమానం ఢిల్లీ చేరుకుంది. ఇండో టిబెటన్ బోర్డర్‌లో విమానం ల్యాండ్ అవగానే అందరిని ఐటీబీపీ కేంద్రానికి తరించారు అధికారులు. 15టన్నుల వైద్య సామాగ్రితో వుహాన్ వెళ్లిన సి -17 గ్లోబ్ మాస్టర్ పైలట్..అక్కడే చిక్కుకున్న వారిని భారత్‌కు తీసుకుని వచ్చింది. వీరిలో 76మంది భారతీయులుండగా బంగ్లాదేశ్ నుండి 29 మంది, మయన్మార్ నుండి ఇద్దరు, మాల్దీవుల నుండి ఇద్దరు, దక్షిణాఫ్రికా, యుఎస్ఎ మరియు మడగాస్కర్ నుండి ఒక్కొక్కరు ఉన్నారు. వీరందరు 14 రోజుల పాటు ఐటీబీపీ నిర్బంధంలో ఉండనున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు పూర్తి అయిన తరువాతే వీరిని స్వస్థలాలకు తరలించనున్నారు. విహారనౌకలో కొవిడ్ వ్యాప్తితో నిర్బంధానికి గురైన భారత పౌరులను ఖాళీ చేయించి తీసుకువచ్చేందుకు సహకరించిన జపాన్ అధికారులకు భారత ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. జపాన్ దేశానికి చెందిన డైమండ్ ప్రిన్సెస్ విహార నౌకలో మొత్తం 3,711 మంది ఉండగా వారిలో 132 మంది భారత సిబ్బంది, ఆరుగురు భారత ప్రయాణికులు. విహారనౌకలో జరిపిన పరీక్షల్లో కొందరికి కొవిడ్ 19 పాజిటివ్ అని రావడంతో ఈ నెల 5వతేదీ నుంచి నౌకలోనే నిర్బంధించి చికిత్స అందించారు. నౌకలోని భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చిన ఎయిర్ ఇండియాను కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్ అభినందించారు. చైనా దేశంలోని వూహాన్ నగరం నుంచి కూడా ఎయిర్ ఇండియా 640 మంది భారత పౌరులను స్వదేశానికి తీసుకువచ్చింది.

# హైకోర్టు జడ్జి బదిలీపై రాజకీయ దుమారం

### కేంద్ర నిర్ణయాన్ని తప్పుపట్టిన కాంగ్రెస్ నేతలు

### కొలిజియం సిఫ్యార్సుమేరకే అన్న మంత్రులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ఢిల్లీ హైకోర్టు జడ్జి ఎస్ మురళీధర్‌ను హర్యాణా హైకోర్టుకు బదిలీ చేసింది. దీంతో కావాలనే మురళీధర్‌ను బదిలీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే ఆయన బదిలీ గురించి ఎస్సీ కొలిజియం ఇంతకు ముందే సిఫారసు చేసింది. ఇందుకుగాను కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ వివరణ ఇచ్చారు. తాము కావాలని బదిలీ చేయలేదని సుప్రీం కోర్టు కొలీజియన్ ఇచ్చిన సిఫారసు మేరకే మురళీధర్ జదిలీ అయ్యారని చెప్పారు. న్యాయమూర్తి మురళీధర్ బదిలీపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. బీజేపీ నేతలను రక్షించేందుకే జడ్జీని బదిలీ చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. జడ్జీని అర్ధరాత్రి బదిలీ చేయడమేంటనీ కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ ప్రశ్నించారు. జడ్జీని బదిలీ చేశారని తెలిసి తాను షాకయ్యాయని ప్రియాంక గాంధీ ట్వీట్ చేశారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురళీధర్ బదిలీపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ట్విట్టర్ వేదికగా స్పంది ంచారు. జస్టిస్ మురళీధర్ అర్ధరాత్రి బదిలీ దిగ్భ్రాం÷-రతి కలిగించిందని పేర్కొన్నారు. ఇది చాలా విచారకరమని.. సిగ్గుచేటన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దుర్భరమైనవని ట్వీట్ చేశారు. ఢిల్లీ అల్లర్లపై విచారణ జరుపుతున్న జడ్జిని అర్ధరాత్రి బదిలీ చేయడమేంటనీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సింగ్ సూర్జేవాలా ప్రశ్నించారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం న్యాయ వ్యవస్థను బీజేపీ నీరుగారుస్తుందని మండిపడ్డారు.

# చైనాలో ఆగని కరోనా మృదంగం

### మరో 29 మంది మృత్యువాత

### మృతుల సంఖ్య 2,744కు చేరినట్టు చైనా వెల్లడి

బీజింగ్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): చైనాలో విజృంభిస్తున్న ప్రాణాంతక వైరస్ కరోనా కారణంగా మరో 29 మంది మృత్యువాత పడ్డారు. దీంతో కరోనావైరస్ మృతుల సంఖ్య 2,744కు చేరినట్టు చైనా ఆరోగ్య అధికారులు వెల్లడించారు. కరోనా వైరస్ ప్రారంభ కేంద్రమైన హుబేయి ప్రావిన్స్‌లోనే అత్యధిక మరణాలు నమోదైనట్టు అధికారులు తెలిపారు. కాగా ఎన్‌హెచ్‌కే వరల్డ్ మీడియా సంస్థ కథనం ప్రకారం తాజాగా చైనాలో మరో 433 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో కరోనా వైరస్ సోకిన మొత్తం చైనీయుల సంఖ్య 78,497కు చేరింది. ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్-19 పాజిటివ్‌గా తేలిన వారి సంఖ్య 81,200గా ఉంది. ఇప్పటి వరకు 30 వేల మందికి పైగా ఈ వైరస్ బారినపడి మళ్లీ కోలుకున్నారు. వీరిలో 2,600 మందిని గడచిన 24 గంటల్లోనే విముక్తి పొందడం విశేషం. ప్రపంచదేశాల్లో కరోనా వైరస్ మరణమృదంగం మోగిస్తోంది. చైనాలో ఇప్పటికే కరోనా 2774మంది మృతి చెందగా బాధితుల సంఖ్య 81,310కి చేరింది. ఇటు ఇరాన్ లో 19మంది కరోనా వైరస్ కు బలికాగా..42దేశాల్లో బాధితుల సంఖ్య 3246కి పెరిగింది. ఒక్క సౌత్ కొరియాలోనే 1596మంది ఈ మహమ్మారి బారిన పడినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే భారత పౌరులకు కేంద్ర హోం, ఆరోగ్య మంత్రిత్వశాఖలు తాజాగా హెచ్చరికలు జారీ చేశాయి. దక్షిణ కొరియా, ఇరాన్, ఇటలీ, ఆస్ట్రేలియా దేశాల్లోనూ కొవిడ్-19 ప్రబలిన నేపథ్యంలో భారత పౌరులు అనవసరంగా ఆయా దేశాలకు వెళ్లవద్దని సూచించాయి.

# అదే పరిపూర్ణత్వం..!

వేదాంతానికి సైన్సు ఎపుడూ అడ్డుకాదు. అలాగే సైన్స్‌తోనూ మరోవైపు వేదాంత ధోరణిలోనూ సాగుతున్న మనిషి జీవితం ప్రకృతికి అసరాకాలేదు. భగవంతుడు సృష్టించిన భౌతిక అద్భుతాలకు అంతం లేదు. అలాగే ఆధ్యాత్మిక ప్రవచనాలలో సత్యాలకు కొదవలేదు. సైన్స్ అనేది సమీప భవిష్యత్‌లో అంతిమ లక్ష్యం చేరుకుని ఆధ్యాత్మిక సత్యాలతో పోల్చుకుంటూ పోతుంటే రెండు భిన్నమైన ప్రపంచాలు లేవని తెలుసుకుంటారు. ప్రపంచం ఒకటే. జీవితం ఒకటే! సృష్టి ఏ కోణంలోనూ భిన్నధృవాలుండవని తెలుసుకుంటుంది. అసలు ఈ ప్రపంచం ఎవరి ఆలోచన? ఎవరి స్వప్న స్వరూపమిది? అసలు ఈ మనిషి ఎవరు? అని ఆలోచిస్తే సమాధానం దొరకదు సరికదా మనసును సందిగ్ధంలో ఉంచేస్తుంది. ఈ విశ్వ దృశ్యాల తెరల వెనుక నిలిచిన నిరంతర జ్ఞానానికి దృశ్యరూపం ఉండదు. ఆ భగవంతుడు అనంతం. ఒకే రూపంతో శాశ్వతత్వంతో నిత్యం మెరుస్తుంటాడు. అనంతం అయినపుడు ఎక్కడికి వెళతాడు? ఎక్కడినుంచి వస్తాడు? మనం ఎక్కడుంటే అక్కడే ఆయన నివాసం. మనసు ఎక్కడుంటే అదే ఆయన రూపం. సర్వజ్ఞానం, సర్వశక్తి, స్వేచ్ఛ, పరిశుద్ధత అతడికి ఉన్నాయి. బయటనుండి ఎటువంటి సహాయం రాదు. ఈ విశ్వస్రష్ఠ అతడే! అతడు భగవంతుడిగా పరిపూర్ణుడిగా మారడం ఏమిటి ప్రత్యేకంగా? అనిపిస్తుంది. అదే దైవం. అదే పరిపూర్ణత్వం.

నేటినిజం
శుక్రవారం 28-2-2020

ఆద్యంత రహితమైన ఈ మహావిశ్వంలో కోటానుకోట్ల నక్షత్ర మండలాలు పరిభ్రమిస్తున్నాయి. ఒక్కొక్క మండలంలో ఎన్నో కోట్ల నక్షత్ర రాశులు తిరుగుతున్నాయి. వాటిమధ్య మనం నివసించే సౌరకుటుంబం పరిమాణం అణువంత. ఈ విశ్వంలో కొత్త నక్షత్రాలు పుడుతున్నాయి.

విశ్వం కాంతివేగంతో విస్తరిస్తోంది. మనకు ఉన్న పరికరాలతో పరిశీలిస్తే నక్షత్ర మండలాలు రెండువేల మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నాయి. కాంతి వేగంతో వెళ్ళగలిగితే ఆ మండలాలను చేరడానికి రెండు వేల సంవత్సరాలు పడుతుంది. ద్వీపాల మాదిరిగా మరిన్ని విశ్వాలు ఏ మాత్రం తెలియని గమ్యం వైపు ప్రయాణిస్తున్నాయి. విశ్వంతో పోల్చితే నక్షత్ర పరిమాణం పరమాణువంత ఉంటుంది.

ఈ విశాల విశ్వంలో మనిషి పరిమాణం ఎంతని? సూదిమొన కంటే చిన్నదే! అటువంటి మరిగుజ్జు మానవుడు దేన్ని చూసి గర్వపడుతున్నాడు? దేనిని సాధించానని అహంకారం చూపుతున్నాడు? తనను తాను అల్పుడిగా భావించినపుడు వినమ్రుడై దిగ్భ్రాంతికి లోనై ఇంత పెద్ద విశ్వాన్ని నడిపేదెవరనే విషయాన్ని ఆలోచిస్తే ఏమని సమాధానం వస్తుందో అంతుపట్టదు. అసలు ఆ ఆలోచన రావడమే మనిషి ఎదగడానికి నిచ్చెన వేసుకున్నట్లే! మన చుట్టూ పదిమందిని డబ్బుతో కట్టేసుకుని మురిసిపోతుంటాం. కానీ సూర్యుని చుట్టూ భూమి తిరగడం, తారలు, చంద్రబింబం గ్రహాలు చూసి తొలి మానవుడు ఆనందం పొందడం వెనుక ఎంతటి అహంకారం ఉండాలో ఆలోచించండి.. అది సృష్టి ధర్మం. మానవునిది ధర్మ ప్రయాణం! అంతే!

## డీసీసీబీ, ఓడీసీఎంఎస్‌పై గులాబీ పట్టు

వరంగల్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): వరంగల్ సహకార ఎన్నికల చరిత్రలో టీఆర్ఎస్ సరికొత్త రికార్డును సృష్టించింది. జిల్లా సహకార కేంద్రబ్యాంక్ ఎన్నికల్లో టీఆర్ఎస్ జయపతాకను ఎగురవేసింది. డీసీసీ బ్యాంక్ చరిత్రలో తొట్టతొలిసారి 17 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీఎంఎస్ పీఠంపైనా తొలిసారిగా గులాబీ జెండా ఎగిరింది. ఇక్కడ మొత్తం 10 మంది డైరెక్టర్లకు గాను ఏడుగురు డైరెక్టర్ల కోసం సింగిల్ నామినేషన్లు దాఖలు కావడం, మిగితా మూడు డైరెక్టర్ల స్థానాలకు సరియైన అభ్యర్థులు లేకపోవడంతో ఈ మూడు స్థానాల విషయంలో రాష్ట్ర సహకార శాఖ రిజిస్ట్రార్ తీసుకునే నిర్ణయం ఆధారంగా ఎన్నిక విధానం ఎలా ఉంటుంది? అనేది తేలుతుంది. మొత్తంగా అటు డీసీసీబీ కానీ, ఇటు డీసీఎంఎస్ కానీ రెండు చోట్లా టీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసింది. వరంగల్ ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహించే ఏకైక సంస్థగా డీసీసీబీ ఉంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న 91 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) ఉండగా మహబూబాబాద్ జిల్లాలోని మల్యాల ప్యాక్‌కు ఎన్నికలు నిర్వహించలేదు. ఎన్నికలు జరిగిన 90 ప్యాక్స్ నుంచి 16 మంది డైరెక్టర్లు డీసీసీబీకి ప్రాతినిధ్యం వహించాలి. జిల్లాల పునర్విభజన నేపథ్యం, ప్రతీ జిల్లా నుంచి ఆయా సంఘాల పరిధి, ప్రాధాన్యత, రిజర్వేషన్ మొదలైన అంశాల ప్రాతిపదికగా డైరెక్టర్లను తీసుకోవాలి. ఈ విషయంలో మంత్రులు అనుసరించిన విధానం, పార్టీ ఆదేశం మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకొని అన్ని జిల్లాలకు సమభాగస్వామ్యం కల్పించడంతో అన్ని జిల్లాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

## టెన్త్‌లో ఉత్తమ ఫలితాల కోసం కృషి

కామారెడ్డి,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ పిలుపునిచ్చారు. పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు రాసే వాతావరణం లేకపోతే.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని స్పష్టంచేశారు. పరీక్షలు రాసే విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చేయాలని, టాయిలెట్స్ శుభ్రంగా ఉంచాలని చెప్పారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు బిల్లులను వెం టనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ చంద్ర మోహన్ రెడ్డికి సూచించారు. మండలాల్లో బిల్లులు సకాలం లో చెల్లించడం లేదని తన దృష్టికి వచ్చిందని, మం డలాధికారులతో మాట్లాడి బిల్లులు ఇప్పించాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద గ్రామానికి సంబంధించిన మౌలిక సమాచారం తప్పని సరిగా ఉండేట్లు ఆదేశాలు ఇవ్వాలని జడ్పీ సీఈవోకు ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నూతనంగా ఏర్పడిన కొత్త గ్రామ పంచాయతీల్లో 104 సేవలు అందుబాటులో లేవని వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామని అన్నారు. కొత్త గ్రామ పంచాయతీలలో కూడా 104 సేవలను అందిస్తామని తెలిపారు.

## రాజకీయంగా బలపడుతున్న టీఆర్ఎస్

### -అన్నికల్లోనూ సత్తా చాటుతున్న గులాబీదళం

ఖమ్మం,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): రాజకీయ, సామాజిక మార్పులకు కూడా ఖమ్మం జిల్లా కేంద్రమైంది. ఎవరూ ఊహించని ఫలితాలను ఖమ్మం జిల్లా ప్రజలు అందిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా గులాబీ పవనాలు వీస్తున్నప్పటికీ శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మంలో ఎదురీదిన టీఆర్ఎస్ ఆ తరువాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ క్లీన్‌స్వీప్ చేస్తూ వస్తున్నది. జిల్లాలో జరిగిన గ్రామపంచాయతీ, స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ హవా కొనసాగింది. సహకార సంఘ ఎన్నికల్లో కూడా ప్రతిపక్షాలు ఒక్కటై ఐక్యంగా పోటీ చేసినప్పటికి టీఆర్ఎస్ పార్టీనే ప్రజలు గెలిపించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో జిల్లాలోని 584 గ్రామపంచాయతీల్లో 80 శాతం పంచాయతీలను టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధించారు. గత నెలలో జరిగిన మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ పార్టీలు నామ మాత్రపు సీట్లకే పరిమితమయ్యాయి. ఇదే క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ), జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) రెండింటి పైన తొలిసారిగా గులాబీ జెండా ఎగిరింది. సహకార చరిత్రలోనే తొలిసారి ఎన్నికల్లో పోటీ చేయడం, అది కూడా 90 శాతం స్థానాలను గెలుచుకోవడం గులాబీ పార్టీకే సాధ్యమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 101 ప్రాథమిక సహకార సంఘాలకుగానూ 85 సంఘాలను టీఆర్ఎస్ గెలుచుకుంది. నాలుగు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం డీసీసీబీ, డీసీఎంఎస్ పాలక వర్గాలను టీఆర్ఎస్ గెలుచు కోగలిగింది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురు సొసైటీ చైర్మన్లు డైరెక్టర్ల కోసం పోటీ పడ్డారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సూచించిన అభ్యర్థినే చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ఈ నెల 29వ తేదీన ఎన్నికైన డైరెక్టర్లు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. అధిష్టానం సూచించిన వారినే డైరెక్టర్లు ఎన్నుకోనున్నారు. ఆ ఎన్నిక కూడా లాంఛనప్రాయమేనని తెలుస్తుంది.

## తెలంగాణ ఉద్యాన పంటలపై నెదర్లాండ్ బృందం ఆసక్తి

### సాంకేతిక సహకారం అందిస్తామని ప్రతిపాదన

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఉద్యానవన పంటల తీరు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలుసుకునేందుకు నెదర్లాండ్ రాయబార కార్యాలయానికి చెందిన ఈ ఏ వాన్‌డిజిల్, ట్రేడ్ కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలో 9మందితో కూడిన బృందం బుధవారం అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్‌తో సమావేశమైంది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో ఉద్యాన వన పంటల పరిస్థితిని, నెదర్లాండ్ ట్రేడ్ బృందానికి వివరించారు. తెలంగాణకు డచ్ సాంకేతి పరిజ్ఞానం కూడా ఎంతో ఉపయోగపడుతోందని వివరించారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో వివిధ ఉద్యాన పంటల ఉత్పాదకతను పెంచడానికి ఆస్కారం ఉందని అన్నారు. తెలంగాణకు అనువైన తక్కువ ఖర్చుతో కూడినవ్యవసాయ సాంకేతికత రాష్ట్రానికి ఉపయోగ పడుతందని అన్నారు. జీడిమెట్ల, ములుగులోని సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థిరత్వం, లాభాలు ఆర్జించే దిశగా వ్యాపార ప్రణాళికను సిద్దం చేయడానికి ఇరు దేశాలు సంసిద్ధతను ప్రకటించాయి.

## అధికారిక సమీక్షలో ఎమ్మెల్యే ఫైర్

### తను లేకుండానే సమావేశం మొదలు పెట్టడంపై ఆగ్రహం

మహబూబాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): మహబూబాబాద్ అభివృద్ధి సమీక్షలో అధికార పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే అయిన తను రాకుండానే సమీక్ష ఎలా నిర్వహిస్తారని ఎమ్మెల్యే శంకర్ నాయక్ ప్రశ్నించారు. స్థానిక సమస్యలు మీకు తెలుసా అంటూ ..మంత్రి సత్యవతి రాథోడ్‌ని ప్రశ్నించారు. రివ్యూ మీటింగ్ అంటే ఫోటోలు దిగడం కాదంటూ సెటైర్లు వేశారు. అనవసర రాద్ధాంతం ఎందుకు చేస్తున్నారు? అని ప్రశ్నించారు. మీరు మాట్లాడిందే కరెక్ట్ అంటే ఎలా అని మంత్రి సత్యవతి అన్నారు. ఎమ్మెల్యే శంకర్ నాయక్‌కు కలెక్టర్ క్షమాపణ చెప్పారు. సత్యవతి, శంకర్ నాయక్ మధ్య వాగ్వాదంతో అధికారులు బిత్తరబోయారు. అంతకుముందు సమావేశం ప్రారంభంకాగానే ఎమ్మెల్యే కాస్తా ఆలస్యంగా వచ్చారు. ఆయన రాకుండానే సమావేశం ప్రారంభించడంతో ఆయన ఆగ్రహానికి గురయ్యారు. తరవాత మంత్రి సత్యవతి సర్ది చెప్పడంతో ఎమ్మెల్యే శాంతించారు.

# ఫీజుల దోపిడీ నుంచి విముక్తి దక్కేనా?

హైదరాబాద్, ఫిబ్రవరి 27:త్వరలో టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. పిల్లలు పరీక్షల కోసం కుస్తీ పడుతున్నారు. పరీక్షల కోసం అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే ఇప్పటికే వచ్చే ఏడాదికి సంబంధించి అడ్మిషన్ల గోల మొదలయ్యింది. ప్రైవేట్ స్కూళ్లు యదావిధిగా వసూళ్లకు తెగబడుతున్నాయి. తల్లి దండ్రులను పీల్చిపిప్పిచేసే పనిలో పడ్డాయి. ఎపిలో మాత్రం సర్కార్ అనేకానేక పథకాలతో విద్యార్థులకు అండగా నిలవాలని చూస్తోంది. మూడేళ్లలో 45 వేల పాఠశాలలు, 471 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 3,287 ప్రభుత్వ హాస్టల్స్, 148 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల రూపురేఖలు మార్చబోతున్నట్లు సిఎం వైఎస్ జగన్ ప్రకటించారు. ఈ కార్యక్రమం కోసం దాదాపు రూ.13 వేల కోట్లు ఖర్చవుతుందని అధికారులు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలన్నీ పూర్తిగా మార్చేందుకు మనబడి నాడు-నేడు కార్యక్రమం అమలు చేస్తున్నారు. మూడేళ్లలో రాష్ట్రంలో అన్ని స్కూళ్ల రూపు రేఖలు మార్చబోయే కార్యక్రమం ఇది. మధ్యాహ్న భోజనం మెనూలో కూడా పూర్తిగా మార్పులు చేస్తూ.. గోరుముద్ద అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.. దీనివల్ల అదనంగా దాదాపు రూ.200 కోట్లు పైచిలుకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రతి పిల్లాడిని చదివించడమే కాదు.. వారు భావితరంతో పోటీ పడాలన్న లక్ష్యం మేరకు ముందుకు సాగుతున్నారు. అంతర్జాతీయంగా పోటీపడే పరిస్థితి రావాలని. అది జరగాలంటే ప్రతి స్కూల్ ఇంగ్లిష్ మీడియం వైపు పరుగెత్తాలన్న సంకల్పంతో సిఎం జగన్ ఉన్నారు. అందుకే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకూ పూర్తిగా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టబోతున్నారు. ఆ తర్వాత ప్రతి ఏడాది ఒక్కో తరగతికి పెంచుకుంటూ మొత్తంగా నాలుగేళ్లలో బోర్డు ఎగ్జామ్‌ను ఇంగ్లిష్ మీడియంలో రాసే పరిస్థితి కల్పిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా పిల్లలకు బ్రిడ్జి కోర్సులు, టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు ప్రకటించారు. వీటన్నింటితో పాటు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా తీసుకొస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా ఎపిలో విద్యారంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారు. దీంతో కార్పోరేట్ స్కూళ్ల ఫీజు దోపిడీకి కళ్లెం పడనుంది. వేలకోట్లు ప్రజల నుంచి పీలుస్తున్న విద్యాసంస్థలకు ముకుతాడు పడనుంది. ప్రభుత్వమే నాణ్యమైన విద్యను, ఇంగ్లిష్ మీడియాన్ని ప్రకటించినందున ఇక ఎపిలో విద్యారంగంలో విప్లవం రాకమానదు. తెలంగాణలో గతంతో పోలిస్తే విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. గురుకులాల ఏర్పాటు వల్ల సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి వచ్చింది. దానిని కాదనలేం.అయితే తెలంగాణలో కెజి టూ పిజి విద్యకు ప్రణాళిక ప్రకటించినా ఎందుకనో అది పట్టాలకెక్కలేదు. నిజానికి కులమతాలకు అతీతంగా విద్యను అందిస్తానని సిఎం కెసిఆర్ పలుమార్లు ప్రకటించారు. సామాన్యుడి నుంచి, రాజకీయ నాయకుల, అధికారుల పిల్లలంతా ఒకే విద్యావిధానంలో చదవాలన్న ఆకాంక్షను ప్రకటించారు. కులరహిత హాస్టల్లు ఉండకూడదని కూడా చెప్పారు. ఇంతటి ఉదాత్తమైన పథకం ఎందుకనో ముందుకు సాగడం లేదు. నిజానికి ఇప్పటి వరకు సిఎం కెసిఆర్ చేస్తున్న పథకాలు ఒక ఎత్తయితే ఈ పథకం ఒక ఎత్తయ్యేది. తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది. కామన్ ఎడ్యుకేషన్ అన్నది సమాజంలో అంతరాలను తొలగిస్తుంది. అది ఎల్‌కెజి నుంచే పిల్లల్లో భేదభావాలు లేకుండా చేస్తుంది. ఇప్పుడున్న స్కూళ్లను చూస్తుంటే ఆర్థికస్థాయిని బట్టి నడుపుతున్నారు. అయితే ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉండగానే గురుకులాలు, ఉర్దూమీడియం స్కూళ్లు ప్రారంభించడం, అనేక హాస్టళ్లను కొత్తగా చేపట్టడం వల్ల పథకం అటకెక్కిందన్న భావన కలుగుతోంది. ప్రస్తుతానికి ఈ ప్రయత్నాలు కూడా మంచి ఫలితాలే ఇస్తున్నాయి. విద్యారంగానికి ప్రభుత్వం కూడా అధిక బడ్జెట్ కేటాయింపులు చేసి వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలి. తెలంగాణ రాష్ట్రం వచ్చాక గురుకుల విద్యాలయాలు 815 అయ్యాయి. ఒక్కొక్క విద్యార్థిపై ఏటా ఒక లక్ష రూపాయలు వెచ్చిస్తున్నారు. పేదపిల్లలకు కార్పోరేట్ విద్యాసంస్థలను తలదన్నే విధంగా చదువు, సౌలభ్యాలు, మౌలిక వసతులు లభిస్తున్నాయి. దాని వల్లనే తొలి సారిగా కార్పొరేట్ విద్యాసంస్థల పాతర్యాంకుల చరిత్రను తలకిందులు చేస్తూ ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు అగ్రస్థానం సాధిస్తున్నాయి. ఇది తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యాలయాల ద్వారా చేస్తున్న నిశ్శబ్ద విప్లవం. చదువుకుంటే నిరుద్యోగిగా మిగిలిపోతున్న ప్రస్తుత తరుణంలో ఉపాధికి తగ్గ చదువు దక్కేలా చేయాలి. అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను, కరికులమ్‌ను మార్చాలి. పాఠశాల స్థాయి నుంచి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి భవిష్యత్తులో సామాజిక మార్పుకు దోహదపడుతుందని రుజువు చేయాలి. అలాగే ఉపాధి అవకాశాలను పెంచడంతో పా టటు చదువును కొనే దుస్థితి నుంచి బయటపడేలా చేయాలి. సామాన్యులకు చదువును దగ్గర చేసేందుకు ఎంతయినా ఖర్చు చేయాలి. అప్పుడే విద్యారగం పటిష్టం కాగలదు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గగలదు. లేకుంటే విద్య కోసం పేదలు సైతం లక్షల్లో ఖర్చు చేసేందుకు అప్పుల బారిన పడుతున్నారు. కార్పోరేట్ స్కూళ్ ఫీజు దోపిడీలను అరికట్టాలి. నిర్ణీత ఫీజులు ఉండేలా చూడాలి. అందుకు తెలుగు రాష్ట్రాల్లో సాగుతున్న కృషి మరింత ముందుకు సాగాలి.

# క్రీడాకారులకు రిజర్వేషన్లతో మార్పు

### ప్రోత్సాహం దక్కడంతో క్రీడాంశాలపై దృష్టి

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): క్రీడలకు సరైన ప్రోత్సహకాలు లేక ఎంతోమంది భావి క్రీడాకారులు మట్టిలో మాణిక్యాలవలే మిగిలిపోయారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు కూడా దినసరి కూలీలాగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కాలం వెళ్ళదీస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. అలాగే క్రీడాకారులకు ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు క్రీడా రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించడం ద్వారా వారిలో ప్రోత్సాహాన్ని నింపారు. దొంగ సర్టిఫికెట్లకు అవకాశం లేకుండా నిజమైన క్రీడాకారులకు రిజర్వేషన్ల ఫలాలు దక్కేలా అన్ని శాఖలు సమిష్టి కృషి చెయ్యాలి. ఈ ఫలితాలు పొందిన క్రీడాకారులు భావి క్రీడాకారులను ప్రోత్సహించాలి. విద్యా ఉద్యోగాల్లో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్లను వర్తింప చేస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే తీసుకున్న నిర్ణయం కారణంగా క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుందని విద్యారంగ నిపుణులు సైతం అభినందిస్తున్నారు. ఇది ఓ రకంగా క్రీడాకారులకు ఎంతో మేలు చేసే నిర్ణయంగా చూడాలి. దీంతో తమకు ఉద్యోగాలు దక్కగలవన్న భరోసా వారిలో ఏర్పడింది. ఇప్పటికే అనేక మంది క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తునన తీరు గతంలో ఎప్పుడూ జరగలేదు. తమ ప్రతిభ ద్వారా దేశానికి, రాష్ట్రాలకి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టే క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల బాధ్యత. ర్యాంక్‌లు, మార్కులకోసం పోటీపడే ప్రస్తుత కాలంలో ఆటలు ఆడితే పిల్లలు పాడవుతారని, చదువుల్లో వెనకబడతారనే తల్లిదండ్రులు ఆలోచిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు క్రీడా సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపించడం లేదు. దానికి కారణాలు కూడా లేకపోలేదు. గ్రామస్థాయిలో సరైన సదుపాయాలు లేకపోవడం, క్రీడలను ప్రోల్సహించేలా పరికాలు, క్రీడా సామాగ్రి లేకపోవడం, ఆడుకోవడానికి మైదానాలు లేకపోవడం వంటి కారణాలూ ఉన్నాయి.

విద్యా సంస్థలు సైతం వీటిని ప్రోత్సహించడం లేదు. హైదరాబాద, తదితర పట్టణాల్లో కార్పోరేట్ స్కూల్ కల్చర్ వచ్చాక క్రీడలను పూర్తిగా విస్మరించారు. కేవలం ఇరుకుగదుల్లో పిల్లలను బందీలను చేశారు. పుస్తకాలను బట్టీ పట్టించడం తప్ప మరోటి వారికి తెలియకుండా చేస్తున్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఏక కాలంలో చదువులపై, ఆటలపై దృష్టి సారించలేరు. అటువంటి విద్యార్థులకు ఉన్నత చదువులలో రిజర్వేషన్ సౌకర్యం ఉండాలి. ఉద్యోగాలలో రిజర్వేషన్ల వల్ల క్రీడాకారులకు భవిష్యత్ ఉపాధికి హామీ ఉంటే క్రీడల్లో తమ పిల్లల్ని ప్రోత్స హించే తల్లిదండ్రుల సంఖ్య క్రమంగా పెరగడానికి అవకాశాలు ఉంటాయి. అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో దాదాపు 29 క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఈ రిజర్వేషన్ సౌకర్యం వర్తించే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం వల్ల తెలంగాణలో మార్పు కనిపిస్తుందనడంలో సందేహం లేదు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత పలు సందర్భాల్లో క్రీడారంగ రిజర్వేషన్లపై అనేక విజ్ఞప్తులు వచ్చాయి. ఇలా అన్ని రంగాల్లో విద్యార్థులు విజయాలు సాధించేలా మన విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోవాలి.

# పులిజాడతో సమీప గ్రామాల్లో అలజడి

### ఎక్కడ దాడిచేస్తుందో అన్న భయాందోళన

### బిక్కుబిక్కుమంటున్న మారుమూల గ్రామాల ప్రజలు

ఆదిలాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ శివారు మండలాల్లో గత కొద్ది రోజులుగా పులుల సంచారంపై అలజడి నెలకొంది. తాజాగా దాని సంచారం కనిపించడంతో పాటు ఓ ఎదద్దుపై దాడిచేసిన ఘటన ఇప్పుడు సమీప ప్రాంతాల ప్రజలకు కునుకు లేకుండా చేస్తోంది. పులుల సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జిల్లాలో పులులు సంచరిస్తున్నా ఇంతవరకు పక్కా ఆధారాలు లభించలేదు. కాని మంగళవారం రాత్రి పులి జైనథ్ మండలం నిరాల వద్ద అంతర్రాష్ట్ర రహదారి దాటుతుండగా రోడ్డుపై కారులో వెళ్తున్న వ్యక్తి సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీయడంతో ఇప్పుడు పులులు తిరుగుతున్నాయన్న వాస్తవం బయటకు వచ్చింది. అయితే తాంసి, భీంపూర్ మండలాల్లో కూడా పులి సంచారం కనిపించింది. పులులు మధ్యలో ఆదిలాబాద్ శివారు మండలాల్లోని జనవాసాల్లోంచి వెళ్తున్నాయి. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి బయటకు వస్తున్న పులులు పెన్‌గంగ నది దాటి వచ్చి ఆవాసం ఏర్పర్చుకునేందుకు అడుగులు వేస్తూ చుట్టుపక్కల మండలాల్లోని గ్రామాలు, పంట పొలాలు, రోడ్లు దాటుతూ వెళ్తున్నాయి. నిరాల వద్ద పులి రోడ్డు దాటుతున్నప్పుడు ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీయడంతో ఇప్పుడు సంచారంపై అనుమానాలు తొలిగాయి. తాంసి, భీంపూర్ మండలాల్లో ఆవులు, ఎద్దులపై దాడి జరిగిన సంఘటనలను బట్టి రెండు పులులు సంచరిస్తున్నాయనే వదంతులు వినిపించాయి. తాజాగా జైనథ్ మండలం నిరాలలో రోడ్డు దాటుతూ ఒక పులి కనిపించింది. ఆ మండలంలోని దేవుజీగూడ గ్రామంలో ఎద్దులపై పులి పంజా విసిరింది. అక్కడ దాని అడుగులు కనిపించాయి. పులులు రాత్రి వేళల్లోనే సంచరిస్తాయని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ప్రతీరోజు సుమారు 20 కిలో మీటర్ల వరకు కదులుతాయని పేర్కొంటున్నారు. పగటి వేళ విశ్రమిస్తుంది. ఒక ప్రత్యేక ప్రాంతంలో కొద్ది రోజులు మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒక ప్రాంతంలో కనిపించిన పులి కొద్ది రోజులు ఆ సమీపంలో ఉండి వెళ్లిపోతుంది. ఇదిలా ఉంటే అటవీ శాఖాధికారులు పులుల విషయంలో గోప్యత పాటిస్తున్నారు. అదే సమయంలో వాటికి జనావాసాల సమూహాల్లో ప్రశాంతత వాతావరణం కల్పించడం ద్వారా అభయారణ్యానికి తరలిపోతాయని చెబుతున్నారు. పంట పొలాల చుట్టూ విద్యుత్ వైర్లు అమర్చకుండా చూస్తున్నారు. ప్రధానంగా గ్రామస్తులు భయంతో వాటిని హతమర్చేందుకు ఇలాంటి చర్యలకు దిగే ఆస్కారం ఉందని, ముందు జాగ్రత్తగా అటవీ శాఖాధికారులు ఈ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం తాంసి, భీంపూర్ ప్రాంతాల్లో ఇప్పటికీ బేస్ క్యాంప్‌ను కొనసాగిస్తున్నారు. పెన్‌గంగకు అవతలి వైపు మహారాష్ట్ర భాగంలోని తిప్పేశ్వర్ పులుల అభయారణ్యంలో పులుల పునరుత్పత్తి పెరిగింది. ప్రధానంగా అక్కడ టైగర్ రిజర్వు ప్రాంతంలో 3 గ్రామాలు ఉండగా, ఆ ప్రజలను అక్కడి నుంచి తొలగించి పునరావాసం కల్పించినట్లు ఇక్కడి అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. పులులకు నీళ్లు, వేట కోసం వన్యప్రాణుల లభ్యత ఉండటం, ప్రశాంత వాతావరణం నేపథ్యంలో ఆడ, మగ పులుల కలయికతో పునరుత్పత్తి పెరిగినట్లు చెబుతున్నారు. అలాగే శాఖహారులైన వన్యప్రాణుల కోసం గడ్డి విత్తనాలు పెంచడం, తద్వారా ఆ వన్యప్రాణులు గడ్డిని ఆహారంగా తీసుకుంటాయి. ఈ వన్యప్రాణులు పులులకు ఆహారంగా మారుతాయి. ఇటువంటి అనువైన పరిస్థితుల్లోనే అక్కడ పులుల సంఖ్య పెరగడానికి దోహదపడినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే తిప్పేశ్వర్ అభయారణ్యం విస్తీర్ణంలో చిన్నది కావడం, ఇటు పులుల సంఖ్య పెరిగిన దృష్ట్యా నిర్దిష్ట ఆవాసం కోసం పులులు తిప్పేశ్వర్‌ను వీడి మరోప్రాంతం కోసం కదులుతున్నాయి. అవి విస్తీర్ణంలో చాలా పెద్దదైన కవ్వాల్ చేరితే ఈ ప్రాంతంలో వాతావరణ సమతుల్యత ఏర్పడేందుకు దోహద పడతాయని అటవీశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు కవ్వాల్‌లో పులుల సంచారం ఉన్నా స్థిర నివాసం ఏర్పర్చుకోలేదని, ఈ నేపథ్యంలో ఈ పులులు కవ్వాల్ వైపు వెళ్తే మాత్రం వాటికి నిర్దిష్ట ఆవాసానికి సరిపడ వాతావరణం ఉందంటున్నారు.

## రెండు లారీలు ఢీ: తప్పిన ముప్పు

### -వైరల్‌గా మారిన దృశ్యాలు

సంగారెడ్డి,ఫిబ్రవరి27(నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి శివారులోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో రెండు లారీలు బీభత్సం సృష్టించాయి. బుధవారం తెల్లవారుజామున ఒకే వైపు వెళ్తున్న రెండు లారీలు పరస్పరం ఢీకొన్నాయి.

కాగా రెండు లారీల మధ్య నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి ఇరుక్కుపోయాడు. అయితే ఆ వ్యక్తికి ఎలాంటి గాయాలు లేకుండా అదృష్టవశాత్తు బతికి బయటపడ్డాడు. మృత్యువు రెండు వైపుల నుంచి లారీల రూపంలో వచ్చినా.. ప్రాణాలతో బయటపడటంతో అందరూ హమ్మయ్య అనుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ టీవీలో రికార్డయ్యాయి. రెండు లారీలు రోడ్డుపై నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేసి రోడ్డుపై నుంచి లారీలను తొలగించారు.

## పట్టణ ప్రగతికి దండిగా నిధులు

### ప్రాథమిక అవసరాలకు ఖర్చు

### పారిశుధ్య నివారణ లక్ష్యంగా కృషి

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): పట్టణ ప్రజల జీవ న ప్రమాణాలు మెరుగుపర్చాలన్న సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతికి ప్రభుత్వం నిధులు భారీగా విడుదల చేస్తున్నది. పట్టణ ప్రగతిలో పట్టణాల బస్తీలు అభివృద్ధి బాట పట్టనున్నాయి. భారీగా వచ్చిన నిధులతో మౌలిక వసతులు కల్పించనున్నారు. మున్సిపాలిటీలకు సర్కారు నిధులను విడుదల చేసింది. దీంతో పదిరోజుల పాటు పట్టణ ప్రగతిలో భాగం గా బస్తీల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్య లను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు చేయనున్నారు. నిధుల కొరతలేకపోవడంతో వెంటనే అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించే దిశలో అధికారులు ముందుకుసాగనున్నారు. మోడల్ మార్కెట్లు, పార్కుల అభివృద్ధి, రక్షిత తాగునీటి సరఫరా, మెరుగైన పారిశుధ్య వ్యవస్థ కోసం వాహనాల కొనుగోలు, ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగల తొలగింపు పనులను చేపట్టనున్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా పట్టణాల్లోని ప్రజల సమస్యలను గుర్తిస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులు అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అక్కడితో ఆగకుండా వాటిని కార్యాచరణలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. భారీగా నిధులు విడుదల చేసిన నేపథ్యంలో చిన్నచిన్న సమస్యలతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. పట్టణ ప్రగతికి నిధుల కొరత లేదు. ప్రణాళికలు చేసి కార్యాచరణ చేయాలన్ని సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లుగానే పట్టణ ప్రగతి ప్రారంభించిన రెండు రోజుల్లోనే నిధులను విడుదల చేసి బస్తీల్లో అభివృద్ధికి బాట లు వేశారు. పట్టణ ప్రగతిలో భాగంగా రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు కలిపి ప్రతి నెలా రూ.148 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌కు రూ.78 కోట్లు కేటాయించగా మిగతా రూ. 70 కోట్లు మిగతా కార్పొరేషన్, మున్సిపాలిటీలకు జనాభా ధమాషా ప్రకారం కేటాయించనున్నారు. పూర్తి గ్రాంట్‌గా ప్రభుత్వం పట్టణ ప్రగతికి నిధులు కేటాయించింది. రూ.74కోట్లు 14వ ÷నాన్స్ కమిషన్ విడుదల చేయగా మరో రూ. 74 కోట్లు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిం ది. పట్టణ ప్రగతిలో ప్రతినెలా కార్పొరేషన్‌లతో పాటు మున్సిపాలిటీలకు నిధులు రానున్నాయి. పల్లె ప్రగతిలో భాగంగా నెలనెలా గ్రామ పంచాయతీలకు రూ.339 కోట్లు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఈ నిధులతో గ్రామాలు అభివృద్ధిలో దూసుకెళున్నాయి. అదే స్ఫూర్తితో పట్టణ ప్రగతికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో అభివృద్ధి వెలుగులు నింపేందుకు ప్రతినెల కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలకు రూ. 148 కోట్ల నిధులను విడుదల చేయనుంది.ఆయా మున్సిపాలిటీలకు జనాభా ధమాషా పద్ధతిలో కేటాయించారు.పట్టణ ప్రగతిలో చేసిన అభివృద్ధి ప్రణాళికలకు నిధులను వినియోగించనున్నారు.

## పారిశుద్య నిర్వహణ ప్రజలందరి బాధ్యత

### -పట్టణ ప్రగతిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ప్రజాప్రతినిధులు, అధికారులు పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పారిశుద్య నిర్వహణ అన్నది ప్రతి ఒక్కరి బాధ్యత కావాలన్నారు. అలాగే ప్రజలు కూడా హరితహారాన్ని ముందుకు తీసుకుని వెళ్లి పట్టణాలను నందనవనాలుగా మార్చలన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీలో ఆయన పర్యటించారు. పట్టణంలోని 2వవార్డు కాలనీ వాసులతో కలిసి మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని అలాంటి వారి పేరున ఉన్న జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత ప్రతీఒక్కరిదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల నిధులను విడుదల చేసి, గ్రామాల, పట్టణాల అభివృద్ధికి పాటుపడుతుందని చెప్పారు. కఠినమైన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలు వచ్చాయని అన్నారు. పందుల పెంపకం దారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపి.. పందుల స్వైరవిహారానికి అడ్డుకట్ట వేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణప్రగతి కార్యక్రమానికి హాజరుకాని కౌన్సలర్లు, అధికారులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు.

## సరోగసీ బిల్లుకు కేబినేట్ ఆమోదం

### వచ్చే సమావేశాల్లో చట్టానికి అవకాశం

### ఢిల్లీ అల్లర్లపై కాంగ్రెస్ విమర్శలు అర్థరహితం: జవదేకర్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): సరోగసీ నియంత్రణ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అద్దె గర్భ నియంత్రణ బిల్లును పటిష్టంగా అమలు చేసే విధంగా రూపొందించారు. కమర్షియల్ సరోగసీని నిషేధించాలని ఆ బిల్లులో పేర్కొన్నారు. నిస్వార్థంగా అద్దెగర్భ విధానం అమలుకు చర్యలను సూచించారు. వచ్చే నెలలో జరగనున్న రెండవ దఫా బ్జడెట్ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. రాజ్యసభలోని సెలెక్ట్ కమిటీకి ప్రతిపాదిత సరోగసీ నియంత్రణ బిల్లును రిఫర్ చేసినట్లు సమాచారశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. అద్దెగర్భం పేరుతో జరుగుతున్న వ్యాపారాన్ని నిరోధించేందుకే ఈ బిల్లును తీసుకుని వస్తున్నట్లు చెప్పారు. ఇదిలావుంటే ఢిల్లీ అల్లర్ల ఘటనపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని జవదేకర్ విమర్శించారు. ఢిల్లీలో అల్లర్లకు బీజేపీనే కారణమంటూ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని, వాటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ అన్నారు. బుధవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, శాంతియుత వాతావరణం నెలకొనేందుకు అన్ని పార్టీలు కృషి చేయాల్సిన తరుణంలో కేవలం నీచరాజకీయాల కోసం ప్రభుత్వంపై నిందారోపణలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అల్లర్లను రాజకీయం చేయడం తప్పని సూచించారు. 'అమిత్‌షా ఎక్కడని కాంగ్రెస్ వాళ్లు అడుగుతున్నారు. ఆయన మంగళవారంనాడు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పరిస్థితిని సమీక్షించారు. కాంగ్రెస్ నేత ఒకరు కూడా పాల్గొన్నారు. పోలీసుల నైతిక స్థైర్యాన్ని పెంచేందుకు అమిత్‌షా తగిన ఆదేశాలు ఇచ్చారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రకటనలు మాత్రం పోలీసుల నైతిక స్థైర్యం దెబ్బతినేలా ఉన్నాయి' అని జవదేకర్ ఆరోపించారు. అంతకుముందు సోనియాగాంధీ ఢిల్లీ అల్లర్లకు కేంద్ర ప్రభుత్వాన్ని, అమిత్‌షాను తప్పుపట్టారు. ప్రస్తుత పరిస్థితికి వారే బాధ్యులని అన్నారు. అమిత్‌షా హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అల్లర్లు జరుగుతుంటే ఢిల్లీ సీఎం ఏమి చేస్తున్నారని నిలదీశారు. బాధితులకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సాయం చేయాలని పిలుపునిచ్చారు.



ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం కెసిఆర్ కేంద్రమంత్రి జవదేకర్‌ను కలిసిన దృశ్యం. చిత్రంలో ఎంపిలు నామా నాగేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, పాటిల్ ఉన్నారు.

## ట్రంప్‌తో లాభమేమిటో లెక్కలేసుకోవాలి!

హైదరాబాద్, ఫిబ్రిరి 27:అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండ్రోజుల భారత్ పర్యటన ముగించుకుని వెళ్లిపోయారు. ఆయన అనేకానేక అంశాలను స్పృశించారు. మనతో బంధాన్ని గట్టి చేసుకోవాలని ఉబలాటపడ్డారు. ఆయన ఎలాంటి లాభాపేక్షతో పర్యటించారో అన్నది పక్కన పెడితే.. ట్రంప్ రాక వల్ల మనకు కలిగే లాభనష్టాలను బేరీజు వేసుకోవాలి. అమెరికా ఐటి రంగాన్ని మనవాళ్లే ఏలుతున్నా..అక్కడ మనవాళ్లే ఎక్కువగా శాసిస్తున్నా ..దానివల్ల అమెరికాయే లబ్దిపొందుతున్నా ఎక్కడా ఆ భావన రాకుండా జగ్రత్త పడ్డారు. ఇక హెచ్1 వీసాలపైనా ఎక్కడా ప్రస్తావన తీసుకుని రాలేదు. భారీతీయులకు రెడ్ కార్పెట్ పరిచే నిర్ణయాలేవీ ప్రకటించలేదు. అమెరికాకు ఉన్నత చదువల కోసం, ఉద్యోగాల కోసం వచ్చే వారి వల్ల లబ్దిపొదుతున్నది అమెరికా అయినా..ఉపాధి మాత్రం మనవాళ్లకు దొరుకుతుంది. మిగా ప్రపంచ దేశాలతో పోలిస్తే భారీతయులే అక్కడ కష్టపడి..అక్కడి చట్టాలకు అనుగుణంగా నడుచుకుంటున్నారు. ఉగ్రవాద కార్యకలాపాలు లాంటి చర్యలకు పాల్పడరు. ఎక్కడికెళ్లినా ఇది తమ భూమి అన్న భావనతో ఇమిడి పోతారు. దశాబ్దాలుగా ఈ విషయం అమెరికాకు తెలుసు. అయినా భారతీయ పౌరులకు సంబంధించి వీసా సమస్యలపై ట్రంప్ మాట మాత్రంగా అయిన ఆమాట్లాడలేదు. ఇకపోతే తీవ్రవాదంపై పోరు అంటూనే తాలిబన్లను, పాక్‌ను చంకనెక్కించుకుంటున్నారు. కాశ్మీర్‌లో వేలు పెట్టాలని ఉబలాటపడుతున్నారు. ఈ విసయాల్లో భారత్ గట్టిగా ఉండాలి. గత ప్రభుత్వాలతో పోలిస్తే కాశ్మీర్, ఇస్లామిక్ టెర్రరిజంపై మోడీ ప్రభుత్వం మాత్రమే ఖచ్చితంగా నిలబడి పోరాడుతోంది. అయితే ఇస్లామిక్ తీవ్రవాదంపై పోరాడుతామని చెబుతూనే పాక్‌తో స్నేహం బలంగా ఉందని ట్రంప్ చేసిన ప్రకటన ఆయన ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనంగా చూడాలి. పాక్ ప్రధాని ఇమ్రాన్ తనకు మంచి మిత్రుడని చెప్పారు. ఇస్లామిక్ టెర్రరిజాన్ని అంతం చేస్తున్నామని చెబుతూనే పాక్ గురించి ఇండియా గడ్డమీద ప్రసంశలు పలకడం ఆయనకు మాత్రమే చెల్లే రాజనీతిజ్ఞతగా గుర్తించాలి. కాశ్మీర్ విషయంలో మరరోమారు తన దుష్టబుద్దిని ప్రదర్శించారు. అవసరమైతే మధ్యవర్తిత్వం నెరపుతానని, ఇరు దేశాల మధ్య కాశ్మీర్ అంశం వివాదంగా ఉందని చెప్పడం ద్వారా అంతర్జాతీయంగా దానిని పెద్దదిగా చేయాలని చూశారు. అమెరికాకున్న ఈ మధ్యవర్తిత్వం ఉబలాటం ఎంత పాతదో, దీనిపై మన దేశానికున్న అభ్యంతరం కూడా అంతే పాతది. ట్రంప్ ఈ విషయం లో చేసిన ప్రకటన మన దేశానికి సహజంగానే ఇబ్బంది కలిగిస్తుంది. మన దేశం పదేపదే కశ్మీర్ సమస్య గురించి పాక్‌తో చర్చించడానికి సిద్ధంగా వున్నామని చెబుతోంది. ఈ విషయంలో ఎవరి మధ్యవర్తి త్వాన్ని అంగీకరించబోమని గతంలో అనేకసార్లు చెప్పింది. ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక, ముఖ్యంగా గత ఆగస్టులో కశ్మీర్ ప్రతిపత్తిని రద్దుచేసి దాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాక ఈ వైఖరి మరింత మారింది. కశ్మీర్ గురించి పాక్‌తో చర్చించాల్సిందేమీ లేదని, అయితే దాని ప్రాపకంతో సాగుతున్న హింస గురించి ఆ దేశంతో మాట్లాడటానికి సిద్ధమని మన దేశం చెబుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్య ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తుందనడంలో సందేహం లేదు. దీనిపై ప్రభుత్వ స్పందనేమిటో చూడాల్సివుంది. కశ్మీర్ సమస్య విషయంలో భారత్, పాకిస్తాన్‌లకు వేర్వేరు కోణాలున్నాయని, ఆ రెండు దేశాలూ కలిసి చర్చించు కుని ఈ విషయంలో ఒక అంగీకారానికి రావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. బహుశా ఒకటికి రెండుసార్లు దీనిపై మీడియా ప్రశ్నించడంవల్ల కావొచ్చు... రెండు దేశాలూ కోరితే మధ్యవర్తిత్వం నెరపడానికి సిద్ధమేనని చెప్పారు. ఇలాంటి విషయాల్లో అమెరాకి కావచ్చు..రష్యా కావచ్చు భారత్ ఖచ్చింతంగా ఉండాల్సిందే. ఇస్లామిక్ టెర్రిరిజం వల్ల భారత్ మాత్రమే కాదు... ప్రపంచం లోని ముస్లింలు కూడా తీవ్రంగా నష్టపోతు న్నారు. కొందరు ముష్కరులు చేస్తున్న దుశ్చర్యల కారణంగా ఆ వర్గం మొత్తం చెడ్డపేరు ఆపాదించు కోవాల్సి వస్తోంది. ఈ దశలో ట్రంప్ చిత్తశుద్ధి ఏ మేరకు అన్నది గమనించాలి. అఫ్ఘనిస్తాన్ నుంచి సైనిక బలగాలను తప్పించాలని ట్రంప్ చూస్తున్నారు. ఇంతకాలం అక్కడ తిష్టవేసి..రష్యా సేనలు పంపించి వేసింది కేవలం తాలిబన్ల కోసమే. కానీ తలకుమించిన భారం కావడంతో అఫ్ఘాన్‌లో ఇప్పుడున్న ప్రభుత్వాన్ని తప్పించి, అధికారం తాలిబన్‌ల చేతిలో పెట్టాలని చూస్తోంది. అది భారత్‌కు తలనొప్పిగా మారుతుందని అమెరికాకు తెలియందేమీ కాదు. కానీ ఏదోవిధంగా సమస్య పరిష్కారం అయినట్టు చూపించి నిష్క్రమించాలని అమెరికా తొందరపడుతోంది. ఒకపక్క మనతో సాన్నిహిత్యాన్ని నెరపుతూనే, మన దేశం నుంచి గరిష్టంగా లబ్దిపొందాలని చూస్తూనే పాక్ ప్రాపకంతో తాలిబన్‌లతో ఒప్పందానికి సిద్ధపడుతోంది. ఈ క్రమంలో మన వైఖరిని పరిగణనలోకి తీసుకోకపోవడం, ఈ ప్రాంత భద్రతకు తగిన హామీ ఇవ్వకపోవడం అన్నది మనం గుర్తించి జాగ్రత్త పడాలి. ఈ విషయంలో అమెరికాతో ఖచ్చితంగా ఉండాల్సిందే. ఉగ్రవాదంపై సమిష్టి పోరు అని భీకరంగా గర్జించినా, అఫ్ఘాన్ నిష్క్రమణ లక్ష్యం ముందున్నది కనుక పాకిస్థాన్‌తో ఆయన నెయ్యం కొనసాగించక తప్పదు. పౌరసత్వ అంశం భారత్ వ్యక్తిగతమని అన్నందుకు మన పాలకుల మనసులు ఊరటపడివుండవచ్చును కానీ, మత స్వేచ్ఛ విషయంలో మోదీ తనకు ఎన్నో హామీలు ఇచ్చారనడం ద్వారా తాను ఈ అంశాన్ని ప్రస్తావించినట్టు ట్రంప్ రుజువుచేసుకున్నారు. మర్యాదలు, ఆలింగనాలు మినహా అమెరికా అధ్యక్షుడి పర్యటనవల్ల మనకు ఒనగూరిన లాభనష్టాలు లెక్కగట్టుకోవడం అనవసరం. ప్రస్తుతం మాటల్లో కనిపించిన ఈ ప్రేమ సమీపభవిష్యత్తులో చేతల్లో ఉంటుందా అన్నది కూడా ఆలోచించి అడుగలు వేయాలి. కాశ్మీర్ లేదా టెర్రిరిజంపై ఖచ్చితంగా ఉండాల్సిందే.

## క్షేమంగా వచ్చి లాభంగా వెళ్లిన ట్రంప్

### భారత్ పర్యటనతో నెరవేరిన స్వలాభాపేక్ష

### వచ్చే ఎన్నికల్లో విజయ వ్యూహంతో సాగిన ట్రిప్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27త(ఆర్ఎన్ఎ): అమెరికాలో ఈ ఏడాది ఆఖరులో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గరిష్టంగా ప్రయోజనం పొందడానికి ట్రంప్ భారత్ పర్యటనకొచ్చారన్నది ఎవరు కాదన్నా అక్షరసత్యం. ఆయన ఆకాంక్ష మేరకు నడుచుకున్నారే తప్ప భారత్‌పై ప్రేమతో కాదని గుర్తుంచుకోవాలి. అమెరికాలో స్థిరపడ్డ భారతీయుల ఓట్లు గంపగుత్తగా కొట్టేయడం ట్రంప్ తోణ కర్తవ్యం.. అక్కడున్న ఎన్నారైల అభిమానాన్ని చూరగొనడంతోపాటు భారత్‌తో కుదుర్చుకునే ఒప్పందాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నానన్న అభిప్రాయం అమెరికా పౌరుల్లో కలిగించాలన్న తాపత్రయంతోనే ట్రంప్ పర్యటన సాగిందన్నది నిజం. . అందుకు మోదీ ప్రభుత్వం కూడా పూర్తి సహాయసహకారాలు అందించింది. అందుకే ట్రంప్‌ను ఇరకాటంలో పెట్టేలా మోడీ...లేదా మోడీని ఇరకాటంలో పెట్టేలా ట్రంప్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో అసాధారణమైన స్వాగత సత్కారాలు అందుకుని స్వదేశంలోని ఓటర్లకూ, ప్రత్యర్థి పక్షానికీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఘనతను చాటుకున్నారు. రెండు దేశాల ప్రస్తుత సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత ఉచ్ఛస్థితిలో ఉన్నాయని ట్రంప్ అభివర్ణించడాన్నిబట్టి చూస్తే మన దేశంపై ఆయనకున్న అసంతృప్తి తగ్గుతున్నదని భావించాలి. ఈ పర్యటన నుంచి ట్రంప్ ఆశిస్తున్న ప్రయోజనాలు వేరు. ఆయన ఇరకాటంలో పెట్టేలా మాట్లాడతారని ఎవరూ అనుకోరు. అందుకే సీఏఏ అంశం పూర్తిగా భారత్ ఆంతరంగిక సమస్యని తేల్చిచెప్పారు.రెండో రోజైన మంగళవారం పూర్తిగా ద్వైపాక్షిక అంశాలపై దృష్టి పెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన చర్చల్లో మూడు వందల కోట్ల డాలర్ల విలువైన రక్షణ ఒప్పందాలు ఖరారు చేసుకోవడంతోపాటు ఇంధనరంగంతోసహా మూడు రంగాల్లో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇరు దేశాల అధికారుల మధ్యా సాగిన చర్చోపచర్చలు ఒక కొలిక్కి రాకపోవడం వల్ల ముందుగా అనుకున్నట్టే వాణిజ్య రంగంలో కుదరవలసిన ఒప్పందంపై ఈ పర్యటనలో సంతకాలు కాలేదు. అయితే అమెరికా సరుకులపై భారత్ విధిస్తున్న అధిక టారిఫ్‌ల గురించి, దానివల్ల తమకు జరిగే నష్టం గురించి ఆయనింకా చెప్పడం మానుకోలేదు.

మాటల్లో ఆత్మీయతను కనబరిచే ట్రంప్ వాణిజ్యంలో మనకు అనాదిగా ఉన్న ప్రాధాన్యతను తొలగించి, రాయితీలన్నీ ఎగరగొట్టేశారు. మన ఎగుమతులను దెబ్బకొట్టిన ఈ నిర్ణయాన్ని పునఃస్సమీక్షించకుండా, మనదేశం అధికసుంకాలు వసూలు చేస్తున్నదంటూ వాపోతున్నారు. స్వర్గీయ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు 1998లో అణు పరీక్ష జరిపినందుకు అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ మన దేశంపై ఆంక్షలు విధించారు. మరో రెండేళ్ల తర్వాత వాటిని పాక్షికంగా తొలగించడంతోపాటు మన దేశంలో అయిదు రోజుల పర్యటనకు కూడా వచ్చారు. మొత్తంగా రెండు దేశాల మధ్యా ఈ రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహసంబంధాలను గమనిస్తే అవి నానాటికీ బలపడుతూనే వచ్చాయని అర్థమవుతుంది. జార్జి బుష్ ఏలుబడిలో అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకున్నాక ఈ సంబంధాలు కీలక మలుపు తిరిగాయి. తాజా చర్చల్లో ఇరు దేశాల సంబంధాలనూ అంతర్జాతీయ సమగ్ర భాగస్వామ్యం స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించడం కూడా అటువంటిదే. మొత్తంగా అమెరికా అధ్యక్షుడి పర్యటన విజయవంతమైనట్టే. డొనాల్డ్ ట్రంప్‌కు ఇది బాగా ఉపకరించినట్టే. రెండు దేశాలూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న వాణిజ్యం ఒప్పందం మీద ఆది నుంచీ ఉన్న అనుమానాలే చివరకు నిజమైనాయి. ట్రంప్‌కు మాత్రం ఆయన విపరీతంగా కలవరించిన ఘనస్వాగతం దక్కింది. మొతేరా స్టేడియం వరకూ రోడ్డుకు ఇరువైపులా జనం బారులు తీరారు. అమెరికా ఆశ్చర్యపోయే స్థాయిలో క్రిక్కిరిసిన స్టేడియంలో లక్షమంది జనం ట్రంప్ ప్రతీ మాటకూ జేజేలు కొట్టారు. అద్భుతమైన ఆతిథ్యంతో అమెరికా అధ్యక్షుడిని భారత్ బాగా ప్రభావితం చేసింది. స్వాగతానికి ఆయన ఎంత మురిసి పోయారో ఆయన ప్రశంసలే చెబుతున్నాయి. అమెరికా భారత్‌ను అభిమానిస్తుందనీ, గౌరవిస్తుందనీ, ఇండియన్లకు అమెరిన్లు నికార్సయిన స్నేహితులని ట్రంప్ నొక్కివక్కాణించారు. ఇరుదేశాల మధ్యా గతంలో ఎన్నడూ లేనంత ఘనమైన అనుబంధం ఇప్పుడు నెలకొన్నట్టుగా ట్రంప్ తన పర్యటన యావత్తూ ఒక ఉద్వేగపూరితమైన వాతావరణాన్ని సృష్టించినమాట నిజం.

# ఆధ్యాత్మిక సందేశాన్ని చాటిన మహనీయుడు రామకృష్ణ పరమహంస

కోల్‌కతా,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలు ఉన్నాయని అనుభవ పూర్వకంగా మొట్టమొదటిసారిగా ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు రామకృష్ణ పరమహంస. రామకృష్ణ పరమహంస చిన్ననాటి నుండే ఆధ్యాత్మిక జీవనంపై ఆసక్తిని చూపేవారు. దక్షిణేశ్వర కాళీ ఆలయంలో అమ్మవారు రాతి విగ్రహం కాదని నిజస్వరూపమని తెలుసుకున్న నాటినుంచి ఆధ్యాత్మిక వైభోగం అధికమైంది. రోజులో అధికభాగం అమ్మవారి సేవలో తరించడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే వారు.

దీంతోపాటు తనకు ఆధ్యాత్మిక జీవనానికి మంచి శిష్యుడు కావాలని అమ్మవారిని సదాప్రార్థిం చేవాడు. అనుకోకుండా ఒకరోజు స్వామి వివేకా నంద రామకృష్ణునికి పరిచయం కావడంతో భవిష్యత్‌లో తన వారసుడిగా స్వామి వివేకానందేనని పరమహంస నిర్ణయించుకున్నాడు. భారతదేశ హైందవ జాతిని ప్రపంచానికి తాను చెప్పదల్చుకున్న విషయాలను స్వామి వివేకానంద ద్వారా తెలియ జేశాడు. పరమహంస జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఆధ్యాత్మిక జీవితంలో చూసినప్పటికీ చివరికి ఆయన జీవితం అమ్మ అనుగ్రహంతో పరిపూర్ణత లభించింది. భారతదేశంలో మత గురువుల బోధకులకు ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇచ్చి ఇతర విషయాలకు తక్కువ ప్రాముఖ్యతను ఇస్తారు. కానీ రామకృష్ణుని జీవితంలో చాలా విషయాలు, ఎన్నో ఆధారాలు ఉన్నాయి. చాలా మంది రామకృష్ణుని శిష్యులు ఉన్నత విద్యావంతులు ఉన్నారు. అతని శిష్యుడు స్వామి శారదనాంద రామకృష్ణుని చుట్టూ తిరుగుతు ఆయన జీవితాన్ని రచించాడు.బాల్యం నుండే రామకృష్ణ పరమహంస ఎన్నో విచిత్రాలు చేసేవారు. దీంతోపాటు చదువుపట్ల, లలి తకళల పట్ల, చిత్రలేఖనంలో కూడా రాణించేవారు. ధన సంపాదన గానీ, ఇతరాత్ర వాటిపైన గానీ ఎలాంటి ఆసక్తి చూపకుండా ప్రకృతినే ప్రేమిస్తూ ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపేవారు. జీవిత ప్రయాణంలో ఎందరో సన్యాసులను కలుసుకుని ఆధ్యాత్మిక విషయాలను నేర్చుకున్నారు. జీవన ప్రయాణంలో ఆధ్యాత్మిక వేత్తలు ప్రసంగించేటప్పుడు రామకృష్ణుడు ఎంతో శ్రద్ధగా విని వారికి సేవలు చేసి వారి మత విషయాలను ఆసక్తితో వినేవారు. అలాంటి రామకృష్ణ పరమహంస స్వామి వివేకానంద పరిచయంతో అతడిని శిష్యుడిగా చేర్చుకొని యావజ్జాతికి ఒక గొప్పనైన సందేశాన్ని అందించారు. జ్ఞానం ఐక్యతను సూచిస్తుందని చాటి చెప్పాడు. ప్రతియేటా పాల్గుణ మాస విధియ పూర్వాభద్ర నక్షత్రం రోజున రామకృష్ణ పరమహంస జయంతి నిర్వహిస్తారు. 19వ శతాబ్దంలో బెంగాల్ సాంస్కృ తిక పునర్జీవనంలో ఆయన ప్రభావం చాలామందిపై పడింది. రామకృష్ణ పరమహంస 1836 ఫిబ్రవరి 18న పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని కామర్పుకూర్ అనే కుగ్రామంలో క్షుదిరాం, చంద్రమణి దేవి దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులు పేద బాహ్మణులైనప్పటికీ దార్మికులుగా జీవనాన్ని సాగించేవారు.

# మెట్రో రెండోదశకు చురుకుగా ప్రతిపాదనలు

### పలు మార్గాల్లో విస్తరణ అవకాశాలపై చర్చ

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి రెండవ దశ ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే... బీఆర్‌టీఎస్‌తోపాటు ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్‌వే డీపీఆర్ కోసం ఇప్పటికే టెండర్లను ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించి ప్రాథమిక డీపీఆర్‌ను ఢిల్లీ మెట్రోరైలు అందించింది. విస్తరణ ప్రాజెక్టులతోపాటు కూకట్‌పల్లి మార్గంలో నిర్మించనున్న ఎలివేటెడ్ బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (ఈబీఆర్‌టీఎస్) ప్రాజెక్టులను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించనున్నారు. రాయ్‌దుర్గ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు ఇతర మార్గాల్లో ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్టులను పీపీపీ విధానంలో నిర్మించాలని భావిస్తున్నారు. పలు ప్రాజెక్టుల పురోగతిపై మెట్రో ఎండి ఎన్‌వీఎస్ రెడ్డి ఇప్పటికే వివరించారు. అలాగే సిఎం కెసిఆర్ కూడా ప్రతిపాదిత ప్రాజెక్టులపై ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ బిల్డ్‌ఆపరేట్(బీవోటీ) పద్ధతిలో నిర్మించడం ద్వారా ప్రభుత్వంపై భారం పడకుండా ప్రయాణ సౌకర్యం అందించవచ్చన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. కాగా... కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు నుంచి ప్రారంభం కానున్న 'ఎలివేటెడ్ బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం 18 కిలోమీటర్ల పొడవుతో నిర్మించేందుకు ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యజమాన్య సంస్థగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్స్ మెట్రోలిమిటెడ్ ప్రాజెక్టు నిర్మించనున్నారు. ప్రభుత్వ భాగస్వామ్యం ఉంటుంది. ప్రభుత్వ సంస్థలైన హెచ్‌ఎండీఏ, టీఎస్‌ఐఐసీ, హెచ్‌ఎంఆర్ఎల్, హెచ్ఏఎంఎల్ ఇందులో భాగస్వామ్యాన్ని కలిగి ఉంటాయి. డీపీఆర్ సిద్ధమయ్యాక టెండర్లను పిలవనున్నారు. మెట్రో రైలుతోపాటు ప్రత్యామ్నాయంగా నిర్మించనున్న... ఎలివేటెడ్ బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం(ఈబీఆర్‌టీఎస్) ప్రాజెక్టు వల్ల ట్రాఫిక్ ఇబ్బంది తీరడంతోపాటు పర్యావరణ ముప్పు కూడా తప్పునుందని చెబుతున్నారు. ఎలివేటెడ్ బస్ సిస్టంలో భాగంగా నిర్మించనున్న ఈ మార్గంలో ఇతర వాహనాలను అనుమతించరు. కేవలం ర్యాపిడ్ సిస్టం బస్సులే నడుస్తాయి. అధికారికంగా ప్రతిపాదించిన మెట్రోరైలు మార్గాల విషయానికొస్తే... రాయదుర్గం నుంచి గచ్చిబౌలి, ఓఆర్ఆర్ మీదుగా, కాజాగూడ, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మిస్తుండగా, బీహెచ్ఈఎల్ నుంచి మియాపూర్, మదీనగూడ, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ జంక్షన్, షేక్‌పేట, మెహిదీపట్నం మీదుగా లకిడీకాపూల్‌కు చేరుకుని మొదటిదశ ప్రాజెక్టులో నిర్మించిన కారిడార్-1 కు మరోమార్గం అనుసంధానమవుతుంది. ఇక నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు మారో మార్గాన్ని నిర్మించతలపెట్టారు. మొదటిదశ ప్రాజెక్టులోని కారిడార్-3కు సంబంధించి నాగోల్ మెట్రోస్టేషన్ నుం చి ప్రారంభమై నాగోల్, బండ్లగూడ జంక్షన్, కామినేని ఆస్పత్రి మీదుగా ఎల్బీనగర్‌లోని మొదటిదశ కారిడార్-1 కు అనుసంధానమవుతుంది. మరో మార్గం ఎల్బీనగర్ నుంచి ప్రారంభమై చాంద్రాయణగుట్ట మీదుగా పాతబస్తీ ప్రాంతాలను టచ్‌చేస్తూ ఫలక్‌నుమాలోని మొదటి దశ ప్రాజెక్టులోని కారిడార్-2 కు అనుసంధానమవుతుంది. మెట్రోతోపాటు ర్యాపిడ్ బస్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం కింద నిర్మితం కానున్న ప్రాజెక్టులన్నీ పూర్తవుతే పాత హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశముందని భావిస్తున్నారు.

# పూర్తిగా అదుపులో పరిస్థితులు

### పలుప్రాంతాల్లో పర్యటించిన అజిత్ దోవల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ఈశాన్య ఢిల్లీలో పరిస్థితులు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. ఢిల్లీ పోలీసుల పనితీరుతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. దేశ రాజధానిలో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల్లో ఇప్పటికే 20 మంది మరణించగా.. పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈశాన్య ఢిల్లీలో పరిస్థితి సమీక్షించేందుకు అజిత్ దోవల్.. మౌజ్‌పూర్, జఫ్రాబాద్ ప్రాంతాల్లో పర్యటించారు. స్పెషల్ సీపీ శ్రీవాస్తవ, అదనపు సీపీ అమన్‌దీప్ సింగ్‌తో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ... వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రేమ భావాన్ని పెంపొందించుకోవాలి. మనందరిదీ ఒకటే దేశం. మనమంతా కలిసే జీవించాలి. అంతా కలిసే దేశాన్ని ముందుకు నడిపించాలని వారికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం ఢిల్లీ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. చట్టబద్ధమైన సంస్థల మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. పోలీసుల పనితీరు బాగుంది. ప్రజలు కూడా ఈ విషయంలో సంతృప్తికరంగానే ఉన్నారని పేర్కొన్నారు. అల్లర్ల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను స్వయంగా పరిశీలిస్తూ... స్థానిక ప్రజలతో మాట్లాడారు. అల్లర్లతో దెబ్బతిన్న ప్రాంతాల్లో కాలినడకన తిరుగుతూ, స్థానికుల్లో ధైర్యం నింపారు. ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని దోవల్ స్థానికుల భుజాలను తడుతూ వారికి ధైర్యం నూరిపోశారు. అజిత్ దోవల్ పర్యటనతో స్థానికుల్లో భయాందోళనలు తొలిగి, వారిలో ఆత్మ స్థైర్యం నిండుతుందని పోలీసు వర్గాలు కూడా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 ని రద్దు చేసిన సందర్భంలో కూడా అజిత్ దోవల్ ఇలాగే కశ్మీర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. అంతేకాకుండా స్థానికులతో, విధుల్లో ఉన్న పోలీసు అధికారులతో మాట్లాడుతూ... కశ్మీరీ ప్రజల్లో ధైర్యం నూరిపోశారు. ఈ ఘటనను చూసిన స్థానికులు అజిత్ దోవల్ జిందాబాద్... జిందాబాద్... అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడం గమనార్హం. అంతకు పూర్వం ఢిల్లీలోని డీసీపీ కార్యాలయానికి వెళ్లి పోలీసు ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు.

## ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానా

### ప్రజల్లో చైతన్యంతోనే పట్టణాల ప్రగతి

### గల్లీల్లో కలియతిరిగిన మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): పారిశుద్ధ్యం విషయంలో ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రజల్లోనూ చైతన్యం కలిగితేనే ఫలితం ఉంటుందని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఖాళీ ప్లాట్‌లలో చెత్తవేసినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడానికి రెండు బుట్టలను కూడా ప్రభుత్వం ఇస్తోంది. ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇవ్వకపోతే 500 రూపాయలు జరిమానా విధిస్తామని ఆయన స్పష్టం చేశారు. పట్టణ ప్రగతిలో భాగంగా మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటజిలా స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేట పరిధిలో బుధవారం పర్యటించారు. ముందుగా 30వ వార్డులో దాదాపు 16 గల్లీల్లో కలియతిరిగారు. నిషేధిత గుట్కాప్యాకెట్‌లు అమ్మడం పై మిరేం చేస్తున్నారని పోలీసు అధికారులను మంత్రి ప్రశ్నించారు. వార్డులోని పలు కాలనీ వీధులు తిరిగి ప్రజలతో మాట్లాడారు.అనేక ప్రాంతాల్లో అడుగడుగునా చెత్త కనిపించడంలతో మంత్రి అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వడం లేదని, దోమల వల్ల ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ పది రోజుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్‌లు పూర్తిచేయాలని అధికారును ఆదేశించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణం వల్ల మలేరియా, డెంగ్యూ వంటి రోగాలు వస్తాయని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇస్తే మోరీలు ఎండిపోయి దోమలు పుట్టవని అన్నారు. రానున్న పదిరోజుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్‌లను పనులు పూర్తిచేయిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## తెలంగాణ వ్యాప్తంగా 230కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం

### -పెద్ద ఎత్తున హరిత కార్యక్రమంలో పాల్గొనాలి: ఇంద్ర

నిజామాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 230కోట్ల మొక్కలు నాటడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అడవుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 92 అర్బన్ పార్క్‌లను నిర్మించామని, ఒక్కో పార్క్‌కు రూ.3 కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు ఖర్చు అయినట్లు వివరించారు. అర్బన్ పార్కుల అభివృద్ధికి కేసీఆర్ చొరవ చూపుతున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడించారు. పెద్ద ఎత్తున మొక్కలు పెంచితేనే మానవమనుగడ ఉంటుందన్నారు. మన పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలంటే హరిత తెలంగాణ సాధించాలన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ పుట్టినరోజున పెద ఎత్తున మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతి ప్రభుత్వశాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి రెండు చొప్పున మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యతను తీసుకుంటున్నారు. మరోవైపు ఆయా ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు పెంచేందుకు నిర్ణయించారు. ప్రభుత్వశాఖలకు, ఉద్యోగులకు అవసరమైన మొక్కలను అటవీ, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలోని నర్సరీల నుంచి సరఫరా చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, అధికారులు, ఉద్యోగులకు అవసరమైన మొక్కలను నర్సరీల నుంచి ఇవ్వాలని అటవీ, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఇప్పటికే తమ సిబ్బందిని ఆదేశించారు. పూలమొక్కలు, పండ్ల మొక్కలు ప్రత్యేకంగా తెచ్చుకొని పెట్టుకునేందుకు కొన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రి ఒక్కరు ఒక్కో మొక్క చొప్పున నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. గతంలో పెట్టిన మొక్కలు చనిపోయిన ప్రదేశాల్లో మళ్లీ మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.




2. నిజామాబాద్ శివారులోని సారంగాపూర అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడ మొక్కలు నాటిన మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి,వేముల ప్రశాంత్ రెడ్డి

## ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

### -ప్రమాద స్థలాలను పరిశీలించిన అధికారులు

కరీంనగర్, ఫిబ్రవరి26(నేటినిజం ప్రతినిది): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శశాంక ఆదేశించారు. గంగాధర మండలం కురిక్యాల శివారులో ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతున్న స్థలాన్ని కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి, డీటీవో పుప్పాల శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ప్రమాదాలు జరిగిన తీరును పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రధాన రహదారివెంట ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు రెండువైపులా మట్టికొట్టుకుపోయి టెంపర్ ప్రమాదకరంగా ఉందని పేర్కొంటూ సైడ్ బర్మ్‌లు పోయించాలన్నారు. ప్రమాద జోన్లను గుర్తించి వాహనాల వేగాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై తప్పనిసరిగా సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు ప్రమాదకర మూలమలుపుల వద్ద వాహనదారులు జాగ్రత్తలు పాటించేలా చూడాలని చెప్పారు. గంగాధర నుంచి మొదలు హుజూరాబాద్ వరకు ప్రధాన రహదారికి రెండు వైపులా ముళ్ల పొదలను తొలగిస్తూ జంగల్ కటింగ్ చేపట్టాలని ఆదేశించారు. వారి వెంట తాసిల్దార్ జింక జయంత్, సీఐ రమేశ్, ఎస్ఐ తాంద్ర వివేక్, తదితరులు ఉన్నారు.

## టోక్యో ఒలంపిక్స్‌పై కరోనా నీడలు

### టోర్నీ నిర్వహణపై సందిగ్ధత

### రద్దుకే మొగ్గు చూపుతున్నామన్న కమిటీ సభ్యుడు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి267(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ ప్రపంచ దేశాలను వణికిస్తోన్న నేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్ నిర్వహణపై సందేహాలు నెలకొన్నాయి. అయితే.. ఈ టోర్నీ నిర్వహణపై తుది నిర్ణయం మరో మూడు నెలల తర్వాత తీసుకుంటామని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ప్రకటించింది. ఒలింపిక్స్ ఏర్పాట్లు చేసేందుకు.. కనీసం రెండు నెలల సమయం అవసరమని తెలిపింది. అయితే ఒలింపిక్స్ కు ఇంకా అయిదు నెలల సమయం ఉందని వెల్లడించింది. అప్పుడే నిర్వహణపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పింది.

ఆటగాళ్లు తమ క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించింది. కరోనా ప్రపంచ దేశాలను వణికిస్తోంది. చైనా సమీప దేశాలకు కూడా ఇది పాకింది. దీంతో క్రీడల నాటికి వైరస్ అదుపులోకి వస్తుందా అన్న అనుమానాలు కొనసాగుతున్నాయి. చైనాతోపాటు ప్రపంచ దేశాలను వణికిస్తున్న కొవిడ్-19 ప్రభావం త్వరలో జపాన్ దేశంలోని టోక్యో నగరంలో జరగనున్న 2020 ఒలింపిక్స్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుందా? అంటే అవునంటున్నారు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సీనియర్ సభ్యుడు, కెనడా మాజీ స్విమ్మింగ్ ఛాంపియన్ అయిన డిక్ పౌండ్. మే నెల చివరి నాటికి కొవిడ్-19 నియంత్రణలో లేనట్లయితే టోక్యో ఒలింపిక్స్ 2020ని రద్దు చేస్తామని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సీనియర్ సభ్యుడు డిక్ పౌండ్ వ్యాఖ్యానించారు. కొవిడ్ వ్యాపిస్తున్నందున ఈ వేసవికాలంలో టోక్యోలో ఒలింపిక్స్ నిర్వహించడం చాలా ప్రమాదకరమని రుజువైతే క్రీడలను పూర్తిగా రద్దు చేస్తామని డిక్ పౌండ్ చెప్పారు. ఒలింపిక్స్ వాయిదా వేయడం, లేదా మరో ప్రాంతానికి తరలించడం కంటే పూర్తిగా రద్దు చేసే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. రెండు నెలల క్రితం చైనాలోని వూహాన్ లో ప్రారంభమైన కొవిడ్ -19 వల్ల 2,715 మంది మరణించిన నేపథ్యంలో దీని ప్రభావం ఒలింపిక్స్ నిర్వహణపై పడింది.ఈ వైరస్ చైనాలోనే కాకుండా దక్షిణ కొరియా, మధ్య తూర్పు దేశాలు, ఐరోపా ఖండంలో ప్రబలింది. కొవిడ్ వల్ల జపాన్ దేశంలోనే నలుగురు మరణించారు. రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా ఒలింపిక్స్ రద్దు చేశారు. జికా వైరస్ వ్యాప్తి చెందినప్పటికీ బ్రెజిల్‌లో రియో గేమ్స్ 2016లో షెడ్యూల్ ప్రకారం సాగింది. కొవిడ్ ప్రబలిన నేపథ్యంలో తాము ఒలింపిక్స్ నిర్వహించాలా లేదా అనే విషయాలపై తాము ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సీనియర్ సభ్యుడు డిక్ పౌండ్ వివరించారు.

## ఆర్టీసీకీ ఆదాయం తెచ్చిన మేడారం జాతర

### -వరంగల్ రీజియన్‌లో 15కోట్ల రాబడి

వరంగల్,ఫిబ్రవరి 27(ఆర్ఎన్ఎ): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు వసూళ్లు తెచ్చిపెట్టింది. ఈ సారి ఊహించని విధంగా ఘనణీయంగా ఆదాయం పెరిగింది. రెండేళ్లకోసారి జరుగుతున్న మేడారం జాతరకు భక్తులను ఆర్టీసీ సంస్థ క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్నది. జాతర భక్తులను తరలించడంలో ప్రజల మెప్పు పొందుతూ ఆదాయాన్ని పెంచుకున్నది. ఈ ఫిబ్రవరి మొదటివారంలో జరిగిన మేడారం జాతరకు రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ మెరుగైన సేవలు అందించింది. వారం రోజులపాటు రాత్రింబవళ్లు రాష్ట్రవ్యాప్తంగా 51 పాయింట్ల నుంచి ఆర్టీసీ సంస్థ భక్తులను చేరవేసింది.

వరంగల్ రీజియన్ నుంచి 18 పాయింట్ల ద్వారా, మిగితా పాయింట్ల నుంచి ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, రంగారెడ్డి రీజియన్ల నుంచి మొత్తం 4వేల బస్సులు మేడారం జాతరక రాకపోకలు కొనసాగించాయి.

ప్రతి జాతరలో వరంగల్ రీజియన్ నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఈసారి కూడా ఉమ్మడి వరంగల్ రీజియన్ పరిధిలోని వరంగల్-1, వరంగల్-2, హన్మకొండ, భూపాలపల్లి, తొర్రూర్, మహబుబాబాద్, జనగాం, నర్సంపేట, పరకాల డిపోల నుంచి హన్మకొండ, కాజీపేట, వరంగల్ కూరగాయాల మార్కెట్, జనగాం, స్టేషన్ ఘన్‌పూర్, కొత్తగూడ, పరకాల, చిట్యాల, మహబుబాబాద్, భూపాలపల్లి, ములుగు ఘన్‌పూర్, కాటారం, సిరోంచ, కాళేశ్వరం, తొర్రూర్, వర్ధన్నపేట, నార్లాపూర్, పస్రా పాయింట్ల నుంచి వరంగల్ రీజియన్ నుంచి 1910 బస్సులు రాత్రి పగలు భక్తులను గమ్యస్థానాలకు చేరవేశాయి. జాతర ప్రారంభం ఈనెల 2వ తేదీ నుంచి జాతర ముగింపు 8వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ ఆర్టీసీ రీజియన్‌లోని తొమ్మిది డిపోల నుంచి వారం రోజుల్లో రూ.15కోట్ల 19లక్షల ఆదాయం సమకూరింది.

గత 2018 జాతరకు ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు రూ 13కోట్ల 78లక్షల 55వేల ఆదాయం వచ్చింది. గత జాతరకంటే ఈసారి బస్సులలో ప్రయాణించిన భక్తుల సంఖ్య 60వేలకు తగ్గింది. మొత్తానికి మేడారం జాతర పేరుతో ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు ఆదాయం గణనీయంగా పెరిగింది. జాతర జాతరకు ఆదాయం పెంచుకోవడంలో వరంగల్ రీజియన్ అధికారులు , సిబ్బంది శక్తివంచన లేకుండా పనిచేయడం వల్ల ఆదాయం పెరుగుతుందని చెప్పవచ్చు. మిగితా మూడు రీజియన్లు ఖమ్మం, కరీంనగర్, రంగారెడ్డి రీజియన్లకు కలిపి సుమారు రూ. 15కోట్ల ఆదాయం వస్తుందని అధికారుల అంచనా. మొత్తానికి జాతరతో ఆర్టీసీ సంస్థకు రూ.30 కోట్ల ఆదాయంలో వరంగల్ రీజియన్ నుంచే సగం రూ.15కోట్ల ఆదాయం రావడం వల్ల రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## బెల్టుషాపులతో జోరుగా వ్యాపారం

### అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా అమ్మకాలు

కామారెడ్డి, ఫిబ్రవరి 27(ఆర్ఎన్ఎ): ఒకవైపు గుడుంబా మానేసిన వారికి ప్రభుత్వం స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరోవైపు బెల్టు దుకాణాలతో కొందరు ప్రజలను మత్తులో ముంచెత్తుతున్నారు. తమ వ్యాపారం సాగడం కోసం వారిని మత్తుకు దగ్గరగా చేస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమవుతోంది.

ఈసారి మద్యం వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ ఏర్పడగా.. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, దోమకొండ, బిచ్కుంద సర్కిల్ పరిధిలో సుమారుగా 40 నూతన వైన్స్ షాపులను ఏర్పాటు చేశారు. మద్యం వ్యాపారులు, పలువురు పలుకుబడి ఉన్నవారు సిండికేట్‌గా మారి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు పోటీపడ్డారు. వీటికితోడు బెల్టు షాపుల నిర్వహణకు మాత్రం ఏమాత్రం అడ్డు అదుపూ లేకుండా పోయిందని విమర్శలు ఉన్నాయి.

బెల్టు షాపుల నిర్వహణకు అడ్డుకట్ట వేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండానే బెల్టు షాపులను నిర్వాహకులు యథేచ్ఛగా దందాను సాగిస్తున్నారు.

నిబంధనలను ఉల్లంఘించి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలను చేపడుతున్నారు. గ్రామాలు, తండాల్లో బెల్టు దుకాణాల్లో కొనసాగుతున్న మద్యం విక్రయాలతో గ్రామీణ ప్రజలు జేబులు గుల్ల చేస్తున్నారు. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో బెల్టు దుకాణాలు జోరందుకున్నాయి. ఒక్కో గ్రామంలో రెండు నుంచి ఐదారువరకు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల వరకు బెల్టు దుకాణాలు కొనసా గుతున్నట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం ప్రియులకు సౌకర్యవంతం గా ఉండేందుకు వీలుగా గ్రామాల్లోనే మ ద్యం అమ్ముతున్నారు. గ్రామాల్లో జోరుగా సాగుతున్న ఈ బెల్టుషాపుల నిర్వహణకు అడ్డుకట్ట వేయాలని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి. మద్యానికి బానిస కావడం తో చాలా కుంటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కొందరు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలున్నాయి.

# డొనాల్డ్ ట్రంప్‌ది నాయకత్వ వైఫల్యం

### ఢిల్లీ అల్లర్లపై స్పందించకపోవడం దారుణం
### డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి బెర్నీ శాండర్స్ మండిపాటు

వాషింగ్టన్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ఇటీవల భారత పర్యటనకు వచ్చి వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై అమెరికా సెనేటర్, డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి బెర్నీ శాండర్స్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భారత పర్యటన సమయంలో చోటుచేసుకున్న ఢిల్లీ అల్లర్లను ఉద్దేశించి ట్రంప్ చేసిన ప్రకటనపై ఆయన నిప్పులు చెరిగారు. ట్రంప్ నాయకత్వ వైఫల్యానికి ఇదే నిదర్శనం అంటూ దుయ్యబట్టారు. తన భారత పర్యటన సందర్భంగా ఢిల్లీలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ట్రంప్ స్పందిస్తూ.. అల్లర్లు చోటు చేసుకున్న విషయం నా దృష్టికి వచ్చింది. అయితే ఈ విషయంపై నేను మోదీతో చర్చించలేదు. అది భారత అంతర్గత వ్యవహారం కాబట్టి నేను మాట్లాడను.. అని పేర్కొన్నారు.

దీనిపై ట్విటర్ వేదికగా శాండర్స్ స్పందిస్తూ... భారత్‌లో 20 కోట్ల మంది ముస్లింలు ఉన్నారు. ముస్లిం వ్యతిరేక దాడుల కారణంగా 27 మంది వరకు చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు. కానీ ట్రంప్ మాత్రం అది భారత అంతర్గత వ్యవహారం..అని పేర్కొన్నారు. మానవ హక్కుల విషయంలో ఇది కచ్చితంగా నాయకత్వ వైఫల్యమే.. అని వ్యాఖ్యానించారు. కాగా ఢిల్లీలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనపై డెమొక్రాటిక్ అమెరికా అధ్యక్ష అభ్యర్థి, సెనేటర్ ఎలిజబెత్ వారెన్ స్పందించగా.. ఇదే అంశంపై స్పందించిన రెండో డెమొక్రాటిక్ అభ్యర్థిగా శాండర్స్ నిలిచారు. డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థులతో పాటు ఇతర సెనేటర్లు కూడా బుధవారం వెలుగుచూసిన ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

## తమిళనాడు మాజీమంత్రి సామి మృతి

చెన్నై,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): తమిళనాడుకు చెందిన మాజీ మంత్రి, డీఎంకే నాయకుడు కేపీపీ సామి గురువారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేపీపీ సామి మృతిపట్ల డీఎంకే నాయకులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 2006 నుంచి 2011 మధ్య కాలంలో తిరువొట్టియూర్ నియోజకవర్గం నుంచి సామి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. కరుణానిధి కేబినెట్‌లో ఫిషరీస్ మంత్రిగా సేవలందించారు. 2011లో అన్నాడీఎంకే నాయకుడి హత్య కేసులో సామితో పాటు ఆయన సోదరుడు అరెస్టు అయ్యారు.

# విశాఖలో వైకాపా నేతల వీరంగం

### చంద్రబాబును అడ్డుకున్న కార్యకర్తలు
### చంద్రబాబు గో బ్యాక్ అంటూ నినాదాలు
### రెండ్రోజులు పర్యటనకు విశాఖ చేరుకున్న బాబు
### గంటపాలు విమనాశరయంలోనే దిగ్బంధం
### కాలినడకన కూడా వెళ్లకుండా వైకాపా కార్యకర్తల అష్టదిగ్బంధనం

విశాఖపట్టణం,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ప్రజాసచైతన్యయాత్రలో భాగంగా విశాఖకు వచ్చిన మాజీ సిఎం , టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు చేదు అనుభవం ఎదురయ్యింది. విశాఖలో అడుగుపెట్టగానే ఆయనను వైకాపా కార్యకర్తలు అడ్డుకున్నారు. ఎయిర్‌పోర్టులో టీడీపీ అధినేత చంద్రబాబు కాన్వాయ్‌ని వైసీపీ శ్రేణులు అడుగడుగునా అడ్డుకున్నారు. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. చంద్రబాబుని కదలనివ్వకుండా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో వెహికిల్ దిగి నడిచి వెళ్లేందుకు చంద్రబాబు ప్రయత్నించినా.. అడుగడుగునా అడ్డు తగిలారు. దీంతో చంద్రబాబు ఎయిర్‌పోర్టులోనే ఉండి పోయారు. రెండ్రోజుల ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా గురువారం విశాఖపట్నం వచ్చిన ఆయనపై అధికార వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. బాబు విశాఖ ఎయిర్ పోర్టులో విమానం దిగిబయటికిరాగానే.. వందలాదిమంది వైసీపీ శ్రేణులు ఆయనను చుట్టుముట్టి.. వెనక్కి వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో బాబు కాన్వాయ్ పై చెప్పులు, కోడిగుడ్లతో దాడి జరిగింది. ‑ూజధానిని అమరావతిలోనే కొనసాగించాలని ఉద్యమిస్తోన్న చంద్రబాబు.. అధికారిక ప్రకటన రాకముందే ఏపీ ప్రభుత్వం విశాఖపట్నంలో రాజధాని పేరుతో రైతుల నుంచి భూములు సేకరించడాన్ని తప్పుపట్టారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి పెందుర్తి మండలంలో రైతుల్ని కలవడానికి వెళ్లాల్సి ఉండగా వైసీపీ శ్రేణులు ఆయనను ఎయిర్ పోర్టులోనే నిర్బంధించారు. బాబు పర్యటనపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో పోలీసులు సైతం పెద్ద సంఖ్యలో మోహరించిఉన్నప్పటికీ.. ఆయన కాన్వాయ్ పై చెప్పులు, కోడిగుడ్లతో దాడి జరగడం గమనార్హం. బాబు విశాఖ పర్యటన నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు ఎయిర్ పోర్టు వైపునకు కదిలారు. అప్పటికే అక్కడ వేల మంది వైసీపీ శ్రేణులు మోహరించారు. చంద్రబాబు ఎయిర్ పోర్టు నుంచి బయటికి వచ్చేక్రమంలో ఒక్కసారిగా వైసీపీ శ్రేణులు ఆయను చుట్టుముట్టాయి. కోడిగుడ్లు, చెప్పులతో దాడి జరిపాయి. కోడిగుడ్లు పోలీసులపై పడటంతో బాబు తృటిలో తప్పించుకున్నట్లయింది. దీంతో టీడీపీ శ్రేణులు వైసీపీ కార్యకర్తలతో బాహాబాహీకి దిగారు. తోపులాటలు, అరుపులతో ఎయిర్ పోర్టు ప్రాంతమంతా రణరంగంగా మారింది.

విశాఖపట్నంలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ ఏర్పాటుకు అంగీకరిస్తేనే చంద్రబాబును ఉత్తరాంధ్రతో తిరగిస్తామని అధికార వైసీపీ నేతలు స్పష్టం చేశారు. ఆ మేరకు ప్రకటన చేస్తేనే కాన్వాయ్ కి దారిస్తామని, లేదంటే అడుగడుగునా చుక్కలు చూపెడతామని హెచ్చరించారు. అధికార పార్టీ కార్యకర్తల ఆగడాలపై టీడీపీ నేతలు భగ్గుమన్నారు. పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నందునే ఇలాంటి పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఎయిర్ పోర్టులో తన కాన్వాయ్ కి అడ్డంగా వైసీపీ కార్యకర్తలు బైఠాయించడంతో దాదాపు గంటసేపు చంద్రబాబు లోపలే ఉండిపోవాల్సి వచ్చింది. ఎయిర్ పోర్టు నుంచి బయటికి వచ్చే అన్ని మార్గాల్లోనూ వైసీపీ శ్రేణులు మోహరించిఉండటంతో ఆయన కారు దిగి.. కాలినడకన బయటికొచ్చేందుకు ప్రయత్నించారు. చంద్రబాబువెంట అచ్చెంనాయుడుతోపాటు ఉత్తరాంధ్రకు చెందిన కీలకనేతలున్నారు.

# పల్లెల్లాగే పట్టణాలను అభివృద్ధి చేసుకుందాం



తసూర్యాపేట, ఫిబ్రవరి 27 : పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధి వలే పట్టణ ప్రగతితో పట్టణాలను అభివృద్ధి చేసుకోవాలని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నేడు హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 18, 19వ వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే బాల్క సుమన్, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అమెరికాలో మరోమారు కాల్పుల కలకలం

### దుండగుడి కాల్పుల్లో ఐదుగురు మృతి

న్యూయార్క్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): ,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): అమెరికాలో మరోసారి గన్ కల్చర్ పేట్రేగింది. విస్కాన్సిన్ స్టేట్ లోని మిల్ వాకీ సిటీలో ఓ దుండగుడు కాల్పులతో బీభత్సం సృష్టించాడు. మాల్సన్ కూర్స్ బీర్ల కంపెనీలోకి చొరబడి సిబ్బందిపై విచక్షిణా రహితంతా కాల్పులకు తెగబడ్డాడు. దుండగుడి కాల్పుల్లో ఐదుగురు సిబ్బంది చనిపోయారు. పలువురికి గాయాలయ్యాయి. రంగంలోకి దిగిన భద్రతా దళాలు దుండగుడి పట్టుకునేందుకు ప్రయత్నించడంతో..తనకు తాను తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాల్పుల సమయంలో ఆఫీసులో వందలాది మంది సిబ్బంది పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.ఉద్యోగం నుంచి తొలగించారన్న కోపంతోనే మాల్సన్ కూర్స్ దాడి చేసినట్లు భావిస్తున్నారు.

# ఖాతాదారులకు ఎస్‌బిఐ హెచ్చరిక

### కెవైసీ సమర్పించాలని డెడ్‌లైన్

ముంబై,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): తమ ఖాతాదారులు ఈనెల 28లోగా తగిన కేవైసీ పత్రాలు సమర్పించని పక్షంలో వారి ఖాతాలను నిలిపివేస్తామని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ స్పష్టం చేసింది. అసంపూర్తి కేవైసీ పత్రాలను అందించిన వారు తక్షణమే తగిన పత్రాలతో సంప్రదించాలని, భవిష్యత్‌లో బ్యాంకింగ్ లావాదేవీల్లో అసౌకర్యాన్ని నివారించాలని ఎస్‌బీఐ తన ఖాతాదారులకు జారీ చేసిన బహిరంగ నోటీసులో పేర్కొంది. ఇటీవల బ్యాంకులు పలుమార్లు రికార్డులను అప్‌డేట్ చేస్తూ కేవైసీ పత్రాలను అడుగుతున్నాయి. కేవైసీ అసంపూర్తిగా ఉన్న ఖాతాదారులను అప్రమత్తం చేస్తూ ఎస్‌బీఐ తరచూ టెక్ట్స్ మెసేజ్‌లు, ఈమెయిల్స్ పంపుతోంది. స్‌బీఐ ఖాతాదారులు ఎవరికైనా అలాంటి మెసేజ్‌లు వస్తే నిర్లక్ష్యం చేయకుండా తగిన సమాచారం అందించడం మేలని తగినంత సమయం ఉన్నందున తగిన కేవైసీ పత్రాలను బ్యాంకులో సమర్పించవచ్చని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు. ఖాతాదారులు తమ సమీప బ్రాంచ్‌ను సంప్రదించి ఎలాంటి చిరునామా, గుర్తింపు కార్డులను అందించి తమ కేవైసీ పత్రాలను అప్‌డేట్ చేసుకోవచ్చు. ఎస్‌బీఐ నెట్‌బ్యాంకింగ్ యూజర్లు తమ కేవైసీని ఆన్‌లైన్‌లోనూ అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు ఉంది. సరైన గుర్తింపు ధ్రువీకరణగా ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, టెలిఫోన్ బిల్లు, పెన్షన్ పేఆర్డర్, విద్యుత్ బిల్లు, ఫోటోతో కూడిన బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, పాన్ కార్డులను సమర్పించవచ్చు. ఇక ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులు కేవైసీ వివరాలను తాజాపరచడంలో భాగంగా బ్యాంకులు ఈ దిశగా కస్టమర్లను అప్రమత్తం చేస్తున్నాయి.

## కరోనాతో మక్కా భక్తులకు ఆటంకం

### వీసాలు నిలిపివేసిన సౌదీ

దుబాయ్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. మక్కా వెళ్లే భక్తులకు సౌదీ ఆరేబియా తాత్కాలిక వీసాలను రద్దు చేసింది. ఈ విషయాన్నిఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. ఉమ్రా, మహ్మద్ ప్రవక్త మసీదు దర్శనం కోసం వచ్చే వారికి కొన్ని రోజుల పాటు వీసాల జారీని నిలిపివేయనున్నారు. ప్రతి నెల వేలసంఖ్యలో ముస్లిం భక్తులు ఉమ్రా దర్శనం కోసం సౌదీ వస్తుంటారు. చైనాలో పుట్టిన కరోనా వైరస్.. మహమ్మారి విజృంభిస్తోంది. దీంతో అనేక ప్రపంచ దేశాల్లో కోవిడ్19 మరణాలు సంభవిస్తున్నాయి. అయితే కొత్త వైరస్ ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో వీసాల జారీని తాత్కాలికంగా నిలిపేసినట్లు సౌదీ చెప్పింది. దేశ ప్రజల రక్షణ, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. కరోనా ప్రబలుతున్న దేశాలకు కూడా ఎవరూ వెళ్లకూడదని దేశ ప్రజలకు సౌదీ సూచన చేసింది.

# పట్టణ ప్రగతిలో ప్రజలు భాగస్వాములు కావాలి

### మీర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సబిత

రంగారెడ్డి,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంత్రి.. మీర్‌పేట్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. పట్టణాలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్ది.. ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం పట్టణప్రగతి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మంత్రి అన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలంతా విధిగా పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రతి వార్డులో దాదాపు 60 మంది సభ్యులతో ఆరు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలియజేశారు. ఈ కమిటీలు వార్డుల్లో హరితహారం, శానిటేషన్, తాగునీరు వంటి ప్రణాళికలు రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఇదివరకు రెండు విడతల్లో నిర్వహించిన 'పల్లెప్రగతి' కార్యక్రమం విజయవంతమైందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంతో పల్లెల రూపురేఖలే మారిపోయాయనీ, ప్రతి గ్రామం పరిశుభ్రంగా తయారైందన్నారు. గ్రామ పారిశుద్ధ్యం, తాగునీరు, మొక్కల నాటడం మొదలైన కార్యక్రమాలు పల్లెప్రగతిలో అమలయ్యాయని మంత్రి అన్నారు. అదే స్ఫూర్తితో పట్టణ ప్రగతిని కూడా విజయవంతం చేయాలని మంత్రి సబితారెడ్డి ప్రజలకు సూచించారు.

# మహిళల టీ ట్వంటీలో భారత్ అద్భుత విజయం

### హ్యాట్రిక్ విన్నింగ్ నమోదు చేసిన విమెన్స్ జట్టు
### న్యూజిలాండ్‌పై 4పరుగుల విజయంతో సెమీస్‌కు

మెల్‌బోర్న్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): టీ20 ఉమెన్స్ వరల్డ్ కప్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా.. న్యూజిలాండ్‌పై 4 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ వరల్డ్ కప్‌లో ఇండియన్ టీంకు ఇది మూడో మ్యాచ్. ఆడిన మూడు మ్యాచులలోనూ ఇండియా విజయం సాధించి, హ్యాట్రిక్‌ను నమోదు చేసింది. ఈ మ్యాచుకు ముందు ఇండియా.. బంగ్లాదేశ్ , ఆసీస్‌లను ఓడించింది. వరుసగా మూడు మ్యాచులలో గెలిచి ఇండియా సెమీస్‌కు చేరింది. తొలుత టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకొని భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. భారత టీం 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. తర్వాత లక్ష్య చేధనలో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. భారత ప్లేయర్ షెఫాలి వర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. మొదటి మ్యాచ్‌లో ఆతిథ్య, డిపెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను మట్టికరిపించి, 18 పరుగులతో విజయం సాధించింది. అనంతరం పెర్త్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను సైతం 18 పరుగులతో తేడాతో చిత్తుచేసింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే.. టీమిండియా నాకౌట్ బెర్త్‌కు చేరువవుతుంది. ఓవల్ వేదికగా న్యూజిలాండ్ మహిళల జట్టుతో తలపడుతున్న టీమిండియా మహిళల జట్టు తక్కువ స్కోరుకే పరిమిత మైంది. నిర్ణీత 20 ఓవర్లలో భారత్.. 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు మాత్రమే చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత బ్యాటర్లలో ఓపెనర్ షెఫాలీ వర్మ(34 బంతుల్లో 46: 4 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు. జ్వరం కారణంగా బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు దూరమైన ఓపెనర్.. స్మృతి మందాన ఈ మ్యాచ్‌లో 11 పరుగులు మాత్రమే సాధించింది. తాహుహు బౌలింగ్ స్మృతి క్లీన్ బౌల్డ్ అయ్యారు. అనంతరం క్రీజులోకి వచ్చిన తానియా భాటియా(23) షెఫాలీకి చక్కటి సహకారాన్ని అందించింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు అర్ధసెంచరీ(51) భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. రోజ్‌మేరి బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన తానియా.. అమెలియా కెర్‌క్రు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరారు. అనంతరం, క్రీజులోకి వచ్చిన ఏ ఒక్క బ్యాట్స్‌వుమెన్ షెఫాలీకి సహకరింకచలేరు. కివీస్ బౌలర్లను ఎదుర్కోలేక వెంటవెంటనే పెవిలియన్ చేరారు. షెఫాలీ క్రీజులో ఉన్నంత వరకు టీమిండియా భారీ స్కోరు సాధించేలా కనిపించింది. కానీ, 14వ ఓవర్లో భారీ షాట్‌కు ప్రయత్నించిన షెఫాలీ.. హైలీ జెన్సన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. చివర్లో శిఖా పాండే(10 నాటౌట్), రాధా యాదవ్ 14 పరుగులు చేసి, భారత్‌కు గౌరవప్రదమైన స్కోరు సాధించిపెట్టారు. న్యూజిలాండ్ బౌలర్లలో రోజ్‌మేరీ, ఎమిలియా కెర్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. లీ తహుహు, కెప్టెన్ సోఫీ డివైన్, కాస్పెరిక్ తలో వికెట్ తీశారు.

## ప్రశాంత్ కిషోర్‌పై చీటింగ్ కేసు

### తన కార్యక్రమాన్ని కాపీ కొట్టారని ఫిర్యాదు

పాట్నా,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): రాజకీయ ఎన్నికల వ్యూహకర్త, జేడీయూ మాజీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్‌పై చీటింగ్ కేసు 420 నమోదైంది. జేడీయూకు రాజీనామా చేసిన తర్వాత.. తాను ఫిబ్రవరి 20 నుంచి బాత్ బీహార్ కీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రశాంత్ కిషోర్ ప్రకటించిన విషయం విదితమే.

అయితే ఈ కార్యక్రమాన్ని కాపీ కొట్టారని బీహార్‌లోని మోతీహారీకి చెందిన గౌతమ్ అనే యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ ప్రారంభించిన పోలీసులు.. కిషోర్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. తాను బీహార్ కీ బాత్ అనే కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి నెలలో ప్రారంభిం చానని, దాన్ని ప్రశాంత్ కిషోర్ కాపీ కొట్టి ఫిబ్రవరి నెలలో బాత్ బీహార్ కీ పేరిట కార్యక్రమాన్ని ప్రారంభించారని గౌతమ్ పేర్కొన్నాడు. ప్రశాంత్ కిషోర్‌పై 420, 406 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టిక(ఎన్ఆర్సీ)కి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తానని ప్రశాంత్ కిషోర్ ఈ నెల 18న ప్రకటించిన సంగతి తెలిసిందే. బీహార్‌కు కొత్త నేత అవసరం అన్న లక్ష్యంతో బాత్ బీహార్ కీ ఉద్యమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రానున్న వంద రోజుల్లో కోటి మంది యువతను తమ ఉద్యమంలో భాగం చేస్తామన్నారు. సీఎం నితీశ్ కుమార్.. బీజేపీతో కలిసి ఉండడాన్ని ప్రశాంత్ తప్పుపట్టారు. పార్టీ ఐడియాలజీని బీజేపీకి సమర్పించడాన్ని కిషోర్ అంగీకరించలేదు.

# శ్రీవారిని దర్శించుకున్న మంత్రి తలసాని



తిరుపతి, ఫిబ్రవరి 27ఫతిరుమల శ్రీవారిని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకున్న మంత్రి.. కళ్యాణోత్సవ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామి వారి వస్త్రంతో మంత్రి తలసానిని సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల తలసాని మీడియాతో మాట్లాడుత ‑ూ.. మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ వ్యక్తిగత నిర్ణయమని దీనిపై తానేమి స్పందించనన్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించిన ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని.. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే ప్రతిపక్ష పార్టీలు విమర్శించడం తగదన్నారు. తెలుగు సినీ ఇండస్ట్రీ మొత్తం హైదరాబాద్ లోనే వుందని.. తెలుగు రాష్ట్రాల్లో చిత్రీకరణలు జరగతావున్నాయని తలసాని తెలిపారు.

## కమిషనర్‌పై నోరు పారేసుకున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): చొప్పదండి మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్‌పై ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతిపై సమాచారం ఇవ్వలేదంటూ..యూజ్ లెస్ ఫెల్లో, తలకాయ ఉందా అంటూ రాజేంద్రకుమార్‌పై రవిశంకర్ మండిపడ్డారు. పట్టణ ప్రగతి ప్రారంభమై రెండు రోజులు గడుస్తున్నా పనుల పురోగతిపై తమకు కన్నీస సమాచారం ఇవ్వలేదంటూ తీవ్రంగా మండిపడ్డారు.

తమాషాలు, పిచ్చి వేషాలు వేయొద్దని మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే వార్నింగ్ ఇచ్చారు. పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జంబుకేశ్వరాలయంలో పురాతన నాణెలిల లభ్యం

చెన్నై,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): తమిళనాడు తిరుచిరాపల్లి జిల్లాలోని అతిపురాతన జంబుకేశ్వర్ ఆలయంలో పాతకాలం నాటి బంగారు నాణెళిలు లభ్యమయ్యాయి. అఖిలాండేశ్వరి సన్నిధి చుట్టూ గార్డెన్‌ను ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు జరిపారు. కూలీలు తవ్వకాలు జరుపుతుండగా.. వారికి ఇనుముతో చేసిన కుండ తగిలింది. దీంతో ఆ కుండను వెలికి తీసి చూడగా.. అందులో 505 బంగారు నాణెళిలు బయటపడ్డాయి. ఆలయ అధికారులు శ్రీరంగం తహసిల్దార్ ఆర్. శ్రీధర్‌కు సమాచారం అందించారు. తహసిల్దార్ నాణెళిలను స్వాధీనం చేసుకున్నారు. బంగారు నాణెళిల బరువు 1.716 కేజీలు ఉన్నట్లుగా శ్రీధర్ తెలిపారు. అయితే ఈ బంగారు నాణెళిలను ఆర్కియాలజీ అధికారులకు అప్పగిస్తామని తహసిల్దార్ చెప్పారు.

## తెలంగాణలో క్షయ నిర్మూలనకు కృషి: గవర్నర్

హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో క్షయ వ్యాధి కేసులు పెరుగుతుండటంతో గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ స్పందించారు. 2025 నాటికల్లా దేశంలో టీబీ నిర్మూలనే లక్ష్యంగా పెట్టుకుంటే.. తెలంగాణలో ఈ కేసులు పెరుగుతునాన్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం ట్వీట్ చేశారు. క్షయ వ్యాధి నియంత్రణ అధికారుల బృందంతో సమావేశం కానున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు తాను పూర్తి చిత్తశుద్ధితో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తమిళిసై తెలిపారు. క్షయ వ్యాధిపై ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని జత చేస్తూ తమిళిసై ట్వీట్ చేశారు.

# పెండ్లి కానుకను ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే



మేడ్చల్ మల్కాజ్‌గిరి, ఫిబ్రవరి 27 : పెండ్లి కానుకగా రూ. 1,00,116 ఇస్తున ఏకైక ప్రభుత్వం మన టీఆర్ఎస్ ప్రభుత్వమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ మండల పరిధిలో మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 92 మంది లబ్దిదారులకు మంత్రి ఈ రోజు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. పుట్టిన శిశువులకు కేసీఆర్ కిట్ అందజేయడం మొదలుకొని ఆడపిల్ల పెళ్లి చేసేవరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ దీపికా, వైస్ చైర్మన్ రమేష్, అడిషనల్ కలెక్టర్ జాన్ శాంసన్, కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE XIIth ADDL. CHIEF JUDGE**
AT: SECUNDERABAD
**O.P. NO. 453 OF 2019**

Between
J Narender
.....Petitioner/Petitioner
And
A K Attakoy & others
....Respondent/Respondents
To,
1.A K Attakoy, s/o Kunjikoy, Major
Occ: Driver, R/o 7/434, Keel Nadugani, Nellialam, Gudulur, The Nilgiris - 643212
.....Respondent No.1

2.Hamza, s/o Kunhipoker, Major
Occ:Business, R/o Door No. 198, Marthalli, Outer Ring Road, Bangalore, Karnataka - 560037
.....Respondent No.2

**NOTICE**

Please take Notice that the Petitioner has filed the above O.P. No. 453/ 2019 for compensation and the above O.P. is posted to **3-3-2020** at 10.30. A.M. for your appearance either in person or through Advocate. If you are fail to appear on that day this case will be decided in your absence.
(BY ORDER OF THE COURT)
Counsel for Petitioner
**G.ASWINI KUMAR**
**G.VENKAT NAGESEH**
**ADVOCATES**
H.No. 12-11-329
WARASIGUDA
SECUNDERABAD
Cell No.: 9848145873

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.